



జిల్లాలోని ఆయా నియోజకవర్గాల్లోని ఆర్‌అండ్‌బీ రోడ్లు

రోడ్లు.. రయ్.. రయ్..!

- గ్రామీణ రోడ్ల విస్తీర్ణం, అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఫోకస్
- హ్యామ్ పద్ధతి కింద రోడ్ల అభివృద్ధి
- జిల్లాలో ఆర్‌అండ్‌బీ పరిధిలో 181 కి.మీలు అభివృద్ధికి ఆమోదం
- పంచాయతీరాజ్ పరిధిలో 264 కి.మీలు రోడ్లకు ప్రతిపాదనలు
- ప్రభుత్వ, కాంట్రాక్టర్ల భాగస్వామ్యంతో పనుల నిర్వహణ
- గ్రామం, మండలం, జిల్లా కేంద్రాలకు లింక్ రోడ్లు

కామారెడ్డి, జూలై 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లోనే కాకుండా మండల, జిల్లా స్థాయిలో రహదారులను అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా ప్రభుత్వం కొత్తగా అమలు చేయనున్న హ్యామ్(హైబ్రిడ్ యాన్యూనిటీ మోడ్) విధానం ద్వారా జిల్లాలో గ్రామీణ రోడ్ల విస్తీర్ణం అభివృద్ధి చేయనుంది. జిల్లాలో రోడ్లు భవనాలు, పంచాయతీరాజ్ శాఖల పరిధిలో 445 కి.మీల మేర రహదారులను ఆధునికీకరించనున్నారు. ఈ రహదారుల పనుల కోసం ప్రభుత్వం నుంచి ఆమోదం లభించింది. హ్యామ్ విధానం ద్వారా మూడు దశల్లో రోడ్ల విస్తీర్ణ అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. రాబోయే మూడేళ్లలో జిల్లాలోని అన్ని గ్రామాలు, మండలాల్లో రోడ్లను అభివృద్ధి చేసే విధంగా పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రత్యేక ప్రణాళికలను సిద్ధంచేశారు. దీంతో గ్రామీణ రోడ్లు మరింత మెరుగుపడి రవాణా సౌకర్యం అందుబాటులోకి రానుంది.

హ్యామ్ విధానం అంటే

హ్యామ్ విధానంలో రోడ్ల నిర్మాణాలకు అయ్యే ఖర్చును ప్రభుత్వం ముందుగా 40 శాతం భరిస్తుంది. మిగితా 60 శాతం నిధులను కాంట్రాక్టర్‌ల ద్వారా చేయిస్తారు. ఈ మొత్తం నిధులతో రోడ్లను బాగు చేయనున్నారు. బ్యాంకు ద్వారా కాంట్రాక్టర్ తీసుకున్న రుణాన్ని ప్రభుత్వం నిర్ణీత సమయంలో తిరిగి చెల్లించనుంది. కాంట్రాక్టర్ రహదారులను 15 సంవత్సరాల పాటు నిర్వహణ కొనసాగిస్తారు. ఇలా ప్రతీ సంవత్సరం కొన్ని చేపట్టనున్నారు. గతంలో నిర్వహణ బాధ్యతలు కేవలం ఐదు సంవత్సరాలకే ఉండేవి. కొందరు కాంట్రాక్టర్‌లు ఇష్టానుసారంగా పనులు చేసి చేతులు దులుపుకునేవారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న హ్యామ్ విధానం ద్వారా జాతీయ రహదారుల నిర్మాణాలు చేపడుతున్నారు. ఇదే తరహాలో గ్రామీణ, జిల్లా రహదారులను అభివృద్ధి చేయనున్నారు.

ఆర్‌అండ్‌బీ పరిధిలో పనులు ఇలా..

జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల పరిధిలో హ్యామ్ విధానం ద్వారా రోడ్లు భవనాల శాఖ పరిధిలో రోడ్లను అభివృద్ధి చేయనున్నారు. ఈ శాఖ పరిధిలో 181.4 కి.మీల మేర రహదారులను ఆధునికీకరించనున్నారు. కామారెడ్డి నియోజకవర్గంలో కామారెడ్డి నుంచి గర్గుల్,రామారెడ్డి, రెడ్డిపేట మీదుగా 19.80 కి.మీలు, పాత జాతీయ రహదా రినుంచి సరంపల్లి, చిన్నమల్లారెడ్డి, గుండారం మీదుగా 8 కి.మీలు నిర్మిస్తారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో ఎల్లారెడ్డి నుంచి తుంపల్లి వరకు 8 కి.మీల దూరం, బస్వన్నపల్లి నుంచి గుండారం మీదుగా బుర్గుపల్లి వరకు 15 కి.మీలు, కృష్ణాజీవాడి నుంచి తాడ్వాయి, ఎర్రాపహాడ్ మీదుగా ఎల్లారెడ్డి వరకు 36.80 కి.మీలు, బాన్సువాడ నుంచి ఉప్పల్‌వాయి రోడ్డు వరకు 30కి.మీల మేర కొత్త రోడ్లు నిర్మించనున్నారు. బాన్సువాడ నియోజకవర్గంలో దుర్కి నుంచి బీర్కూర్ వరకు 9 కి.మీలు, బాన్సువాడ నుం చి ఉప్పల్‌వాయి వరకు 10 కి.మీలు, బోర్లం నుంచి దుర్కి వరకు 8.2 కి.మీలు, బాన్సువాడ నుంచి బిచ్కుంద వరకు 4 కి.మీలు రోడ్లు వేయనున్నారు. జుక్కల్ నియోజకవర్గంలో బాన్సువాడ నుంచి బిచ్కుంద వరకు 28 కి.మీలు, అన్నాసాగర్ నుంచి పిట్లం వరకు 10 కి.మీలు మద్దెల చెరువు నుంచి పిట్లం వరకు 19.4 కి.మీల వరకు నిర్మిస్తారు.

పంచాయతీరాజ్ పరిధిలో పనులు ఇలా..

నాలుగు నియోజకవర్గాల పరిధిలోని పంచాయతీరాజ్ శాఖ పరిధిలో 88 రహదారుల నిర్మాణాలు చేపట్టనున్నారు. ఈ శాఖ పరిధిలో 264 కి.మీల మేర రోడ్లు వేయనున్నారు. కామారెడ్డి నియోజకవర్గంలో మొత్తం 42 రహదారులకు 115.87 కి.మీల పరిధిలో బీటీ రోడ్లు 107.22 కి.మీలు, సీసీ రోడ్లు 2.95 కి.మీలు, మెటల్ రోడ్లు 4.70 కి.మీలు వేయనున్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో మొత్తం 22 రహదారులకు 71.03 కి.మీల పరిధిలో బీటీ రోడ్లు 54.96 కి.మీలు, సీసీ రోడ్లు 9.27 కి.మీలు, మెటల్ రోడ్లు 4.90 కి.మీలు వేయనున్నారు. జుక్కల్ నియోజకవర్గంలో మొత్తం 24 రహదారులకు 77.78 కి.మీల పరిధిలో బీటీ రోడ్లు 59.86 కి.మీలు, సీసీ రోడ్లు 5.80 కి.మీలు, మెటల్ రోడ్లు 5.80 కి.మీలు వేయనున్నారు.

మూడు విడతల్లో పనులు

జిల్లాలో హ్యామ్ విధానం ద్వారా రహదారుల నిర్మాణం మూడు విడతల్లో చేపట్టనున్నారని సంబంధిత అధికారులు చెబుతున్నారు. ఆయా రోడ్ల

(మిగతా 8వ పేజీలో)



వీక్లి మార్కెట్‌లో పుట్ట వద్ద పాలు పోస్తున్న మహిళలు

వైభవంగా నాగుల పంచమి

కామారెడ్డి టౌన్, జూలై 29(ఆంధ్రజ్యోతి): నాగుల పంచమి పండుగ వేడుకలు మంగళవారం కామారెడ్డిలో వైభవంగా జరిగాయి. పట్టణంలోని ఆయా ప్రాంతాల్లోని పాముల పుట్ట, ఆలయాలు భక్త జనంతో కిక్కిరిసి పోయాయి. భక్తులు, మహిళలు పాము పుట్టలో ఆవు పాలు పోసి పూజలు నిర్వహించారు. పట్టణంలోని వీక్లి మార్కెట్, గంజ్, మున్సిపల్ వాటర్ వర్క్స్ కార్యాలయం, డిగ్రీ కళాశాల వద్ద గల రాశీవనం, రైల్వేస్టేషన్, వివేకానందకాలనీ, ముదాంగల్లి, పెద్దమ్మగల్లి, పంచముఖి హనుమాన్ ఆలయం, రాంమందిర్‌రోడ్, అశోక్‌నగర్ కాలనీ, శ్రీరాంనగర్ కాలనీ తదితర కాలనీలోని పుట్టల్లో ఆవు పాలను పోశారు. ప్రసాదంగా జొన్న ప్యాలాలు, శనగలు, స్వీట్లను దేవతలకు సమర్పించారు. అలాగే ఆనవాయితీగా వస్తున్న సోదరీమణులు తమ సోదరుల కళ్లను ఆవు పాలతో కడిగి సంస్కృతిని చాటారు. సోదరులు ఇచ్చిన కట్నకానుకలను సోదరీమణులు స్వీకరించి ఆశీర్వదించారు. కాగా భారత్‌రోడ్డు, శేర్‌గల్లి, గోపాల్ స్వామి రోడ్డు, గాంధీగంజ్, సిరిసిల్లా రోడ్డు తదితర ప్రాంతాల్లో ఉచిత పాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు.



సినారే చిత్ర పటానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం

ఘనంగా సినారే జయంతి

ఎల్లారెడ్డి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం సినారే 94వ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సినారే తెలుగు సాహిత్యానికి జాతీయ, అంతర్జాతీయ ఖ్యాతి ఇచ్చిన మహానుభావుడు సినారే అని కొనియాడారు. ఆయన రాసిన సినిమా పాటలు మానవ విలువలు రూపొందించేలా ఉంటాయని అన్నారు. అనంతరం ఇటీవల భువనగిరి జిల్లా సాహిత్య సంస్థల సమాఖ్య వారి సినారే సాహిత్య పురస్కారం అందుకున్న కళాశాల తెలుగు అధ్యాపకులు శంకరయ్యకు కళాశాల బృందం సన్మానం చేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ చంద్రకాంత్, టిఎస్‌కె సివకుమార్, సీనియర్ అధ్యాపకులు అమరేశం ప్రభాకర్ రావు, నాగనిక, అరుణ్ కుమార్, చంద్రకాంత్, సిద్దు రాజ్, రాణి కృష్ణ, ప్రసాద్, గోదావరి, గంగారెడ్డి, శశిధర్, సంగీత స్వప్న సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



టీపీసీసీ సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి

టీపీసీసీ సమావేశంలో పాల్గొన్న గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి

కామారెడ్డిటౌన్, జూలై 29(ఆంధ్రజ్యోతి):హైదరాబాద్‌లోని మంగళవారం పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ నిర్వహించిన సమావేశానికి టీపీసీసీ ప్రధానకార్యదర్శి గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెలఖరులో రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మీనాక్షినటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌లు నిర్వహించే పాదయాత్ర, స్థానిక సంస్థల ఎన్నికలపై చర్చించామని తెలిపారు. జడ్పీటీసీ,ఎంపీటీసీ,మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ పటిష్టత, గెలుపు విషయాలపై దిశనిర్దేశం చేశారని తెలిపారు.



సమావేశంలో పాల్గొన్న డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు

న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో కాంగ్రెస్ నాయకుల సమావేశం

కామారెడ్డి టౌన్, జూలై 29(ఆంధ్రజ్యోతి):హైదరాబాద్‌లోని న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులతో ఏఐసీసీ రాష్ట్రఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌లు సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు కైలాస్‌శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు,రాబోయే రోజుల్లో చేపట్టబోయే పాదయాత్రపై దిశనిర్దేశం చేసినట్లు తెలిపారు.కార్యకర్తలకు,ప్రజలకు అందుబాటులో ఉండి పార్టీ బలోపేతం చేసేందుకు కృషిచేయాలని సూచించారని తెలిపారు.

ఆజామాబాద్‌లో రైతులకు అవగాహన

ఎల్లారెడ్డి రూరల్, జూలై 29(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మండల పరిధిలోని ఆజామాబాద్ గ్రామంలో గల రైతువేదికలో మంగళవారం రైతునేస్తం కార్యక్రమాన్ని ఏఈవో రాజాగౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యమంలో భాగంగా రైతులకు వానాకాలంలో పండించే పంటలపై శాస్త్రవేత్తలు దృశ్యమాద్యమం ద్వారా అవగాహన కల్పించారు. పంటల సాగు చేస్తున్న రైతులకు సాగులో మెలకువలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అధిక లాబాలు పొందడానికి పాటించాల్సిన చర్యల గురించి అవగాహన కల్పించారు. అదేవిధంగా పశుసంపద మేకలు, గేదేలు తదితర వ్యవసాయ అనుబంధ పశువుల పెంపకం గురించి వాటి వలన వచ్చే అధాయ మార్గాల గురించి వివరించారు.

కాలభైరవ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

రామారెడ్డి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాలభైరవ స్వామి ఆలయంలో అంగరంగంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణ మాసం మొదటి మంగళవారం ప్రియమైన రోజు కావడంతో అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఆలయ గర్భగుడిలో ఆలయ పురోహితులు మంత్రోచ్ఛారణలతో సంతతధారాభిషేకం, క్షీరాభిషేకం, సింధూర, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ఉచితంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో బుర్ల ప్రభురాం చంద్రం గుప్తా, ఆలయ మాజీ చైర్మెన్ కైలాస్ రాజేశ్వర్ రావు గుప్తా తదితరులు పాల్గొన్నారు.

బీసీ బిల్లు ఆమోదం కోసం..

పార్లమెంటును స్తంభింపజేస్తాం



మహిళలకు రేషన్‌కార్డులు అందజేస్తున్న మంత్రి సీతక్క

మంత్రి సీతక్క

కామారెడ్డి, జూలై 29(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించకపోతే బిల్లు ఆమోదం కోసం పార్లమెంట్‌ను స్తంభింపజేస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్, మహిళ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఢిల్లీ స్థాయిలో మూడు రోజుల పాటు పోరాటం చేస్తామన్నారు. బీసీ బిల్లు చట్టబద్ధత కోసం రాష్ట్రపతిని కలుస్తామన్నారు. గత పది సంవత్సరాలు అధికారంలో ఉన్నప్పుడు బీఆర్‌ఎస్ మహిళలను పట్టించుకోలేదని ఆమె విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతుంటే చూసి ఓర్వలేక ప్రభుత్వంపై కేటీఆర్‌తో పాటు బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రధానంగా పేద, మధ్య తరగతి, చిరు ఉద్యోగం చేసుకునే మహిళల కోసం కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆర్టీసీలో ఉచిత ప్రయాణం పథకాన్ని అమలు చేసిందన్నారు. ఈ పథకంపై ఇటీవల కేటీఆర్ మహిళలను అవమానించే విధంగా కామెంట్ చేయడం సిగ్గు చేటన్నారు. కాంగ్రెస్ మహిళలకు ఉచిత ప్రయాణం కలిపిస్తుంటే కేటీఆర్ చూసి ఓర్వలేకపోతున్నారని, ప్రస్టేషన్‌లో ఆయన అర్థం లేని మాటలు మాట్లాడుతున్నారంటూ ఆరోపించారు. దేశంలో చాలా రాష్ట్రాల్లో బీజేపీ ప్రభుత్వం ఉన్నప్పటికీ ఎక్కడా కూడా రూ.500లకే గ్యాస్ సిలిండర్‌ను మహిళలకు ఇవ్వడం లేదన్నారు. కామారెడ్డి జిల్లాలోని దోమకొండ మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమలో మంత్రి సీతక్క లబ్ధిదారులకు కొత్త రేషన్‌కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించకపోతే బిల్లు ఆమోదం కోసం పార్లమెంట్‌ను స్తంభింపజేస్తామని అన్నారు. ఢిల్లీ స్థాయిలో మూడు రోజుల పాటు పోరాటం చేస్తామన్నారు. బీసీ బిల్లు చట్టబద్ధత కోసం రాష్ట్రపతిని

(మిగతా 7వ పేజీలో)

ఆరోగ్య కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేయాలి

కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్



జంగంపల్లి పల్లె దవాఖానాలో మందులను పరిశీలిస్తున్న కలెక్టర్

భిక్కనూరు, జూలై 29(ఆంధ్రజ్యోతి): ఆసుపత్రి పరిధిలోని ఆరోగ్య కార్యక్రమాలను వైద్య సిబ్బంది పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు. మంగళవారం మండలంలోని జంగంపల్లి పల్లె దవాఖానాను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దవాఖానా పరిసరాలను పరిశీలించి రికార్డులను, మందులను పరిశీలించి ఓపీ, ఏఎన్సీ చెకప్, తదితర విషయాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రి పరిధిలో తరచూ ఫీవర్ సర్వే కార్యక్రమాన్ని చేపట్టాలని, ఎక్కడైనా సీజనల్ వ్యాధులు నిర్ధారణ అయితే వైద్య సిబ్బంది అప్రమత్తమై వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలన్నారు. మండంలోని అన్ని గ్రామాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని, శానిటేషన్ పనులు ఎప్పటికప్పుడూ సక్రమంగా నిర్వహించాలన్నారు. ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునే విధంగా గ్రామ పంచాయతీ సిబ్బంది, వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆసుపత్రిలో నిర్వహించే రోజువారి కార్యక్రమాలను రిజిస్టర్లలో నమోదు చేయడంతో పాటుగా వాటిని ధ్రువీకరించాలన్నారు. మండలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో ఆలస్యం కాకుండా వేగవంతం చేయాలని, లబ్ధిదారులకు ఇసుక, మొరం కొరత లేకుండా అధికారులు ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్, డిప్యూటీ వైద్యాధికారి ప్రభుకిరణ్, ఎంపీడీవో రాజ్‌కిరణ్‌రెడ్డి, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు ఊరట

కామారెడ్డి టౌన్, జూలై 29(ఆంధ్రజ్యోతి): 2003 సంవత్సరంలో డీఎస్సీ ద్వారా నియామకమైన ఉపాధ్యాయులకు ఊరట లభించిందని జిల్లా 2003 డీఎస్సీ పోరాట సమితి అధ్యక్షుడు దుర్గాప్రసాద్ తెలిపారు. పాత పెన్షన్ విధానానికి 2003 డీఎస్సీ ఉపాధ్యాయులు అర్హులని హైకోర్టు డివిజన్ బెంచ్ తీర్పును వెలువరిచిందని తెలిపారు.



ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న దృశ్యం

హస్తం గూటికి బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు

సదాశివనగర్, జూలై 29(ఆంధ్రజ్యోతి): సదాశివనగర్ మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, అడ్లూర్ ఎల్లారెడ్డి వీడీసీ చైర్మన్ ముదాం సత్యం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు సమక్షంలో ఎమ్మెల్యే నివాసంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే కాంగ్రెస్ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి సాధరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన అనంతరం మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో జరుగుతున్న అభివృద్ధిని చసి తనవంతు సేవలు గ్రామానికి కాకుండా నియోజకవర్గంలోని ప్రజలకు అందించడానికి పార్టీలో చేరినట్లు తెలిపారు. పార్టీలో త్వరలో సముచిత స్థానం కల్పిస్తానని ఎమ్మెల్యే ఈ సందర్భంగా హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సాగర్ పాల్గొన్నారు.

స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తులు

ఎల్లారెడ్డి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎంపీసీ, బైపీసీ గ్రూపులలో మిగిలిన ఖాళీలను భర్తీ చేయుట, అర్హత గల విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల, ఆదాయ, మెమో ధ్రువీకరణ పత్రాలతో బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అర్హత గల పదవ తరగతి పూర్తయిన విద్యార్థులు స్పాట్ అడ్మిషన్ల కొరకు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.

ప్రభుత్వ బడుల్లో ప్రీ ప్రైమరి

- ప్రాథమిక పాఠశాలలో అమలుకు ఉత్తర్వులు
- 4 సంవత్సరాలు నిండిన పిల్లలను పాఠశాలల్లో చేర్పించేలా చర్యలు
- జిల్లాలో 71 పాఠశాలల గుర్తింపు



శివాయిపల్లి ప్రాథమిక పాఠశాల

కామారెడ్డి టౌన్, జూలై 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంతో పాటు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసింది. ఇప్పటి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో నేరుగా 1వ తరగతి నుంచే విద్యాభ్యాసం ఉండగా ప్రైవేట్ పాఠశాలల్లో మాత్రం నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ అంటూ ప్రీ ప్రైమరీ పాఠశాలలను ఏర్పాటు చేసి విద్యార్థులకు చదువుపై ఆసక్తి కలిగేలా ఆట పాటలతో బోధనలు చేస్తున్నారు. దీంతో తల్లిదండ్రులు సైతం తమ పిల్లలకు మొదట పాఠశాలలు అలవాటు కావాలనే ఉద్దేశ్యంతో ప్రైవేట్ పాఠశాలల వైపే మొగ్గు చూపుతున్నారు. నర్సరీలో కేవలం ఆటపాటలకు ఎక్కువగా సమయం కేటాయించి ఆ తర్వాత కొద్దికొద్దిగా పిల్లలను విద్యను నేర్చుకునేవిధంగా సిద్ధం చేస్తున్నారు. ఇలా నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీలలో దాదాపు 3 సంవత్సరాల వరకు పిల్లలు బేసిక్ పాఠాలను నేర్చుకున్న తర్వాత ప్రైమరి విద్యను అందేలా చూస్తున్నారు. కానీ ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రం ఏకంగా 1వ తరగతి ఉండే సరికి అంగన్‌వాడీ నుంచి వెళ్లిన పిల్లలకు బేసిక్స్ కూడా సరిగా తెలియక ప్రైవేట్‌లో చదివిన విద్యార్థుల కంటే వెనుకబడి పోతున్నారు. దీన్ని గుర్తించిన ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లోనూ ప్రీప్రైమరీని తీసుకుని వచ్చి ప్రభుత్వ పాఠశాలల్లో పెద్ద మొత్తంలో విద్యార్థులు చేరేలా చర్యలు తీసుకుంది.

జిల్లాలో 71 పాఠశాలలు గుర్తింపు

పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలోని 71 ప్రాథమిక పాఠశాలలో ప్రీప్రైమరీల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. పాఠశాలలకు వచ్చే విద్యార్థులను ఆకట్టుకునేలా ఆయా పాఠశాలలను ఆకర్షణీయంగా మార్చనున్నారు. శివాయిపల్లి, లచ్చపేట, ఆరేపల్లి, దెమెకలాన్, పల్వంచ, ఇసాయిపేట, చుక్కాపూర్, ఫరిదిపేట, కన్కల్, ఎర్రాపహాడ్, గాంధారి(గర్ల్స్), బస్వాపూర్, బండా రామేశ్వర్‌పల్లి, ఎల్లారెడ్డిపల్లి, వాడి, శేఖాపూర్,నందివాడ, సంతాయిపేట, బీర్కూర్ తండా, బీర్కూర్(గర్ల్స్), అక్కాపూర్, ఆర్గొండ, డోంగ్లి, చందాపూర్, గిద్ద, గాంధారి, చిన్న మల్లారెడ్డి, బాన్సువాడ ఆశ్రమ్(గర్ల్స్), జనగామా, ఇబ్రోజీవాడి, కిష్టాపూర్, మహదన్‌హపర్గ, ఆర్‌బీనగర్, అంబర్‌పేట, బ్రహ్మజీవాడి, రాజుల్ల, అంజని తండా, దేవునిపల్లి, పోతారం, మద్దికుంట, జలాల్‌పూర్, శివరాజన్ తండా, దోస్తపల్లి, అవజ్‌పల్లి తండా, పల్లెపల్లి, ఇస్సానగర్, యాచారం, సోమేశ్వర్, బాలాజీ నగర్ తండా, మహిబాపూర్, ఎండ్రియాల్, గర్గుల్, బంజేర్‌పల్లి, మల్లాపూర్, వడలపర్తి, వెంకపల్లి, తిమ్మాపూర్, కొండాపూర్, వండ్రికల్, బ్రాహ్మణపల్లి, సీతారాంతండా, రామయిపల్లి, గోపల్‌పల్లి, కొయ్యగుట్టతండా, మతూర్, బోపస్‌పల్లి, తుర్కేపల్లి, గంట్లాడతండా పాఠశాలలను ఎంపిక చేశారు. ఈ పాఠశాలల్లో ఒక ఉపాధ్యాయుడితో పాటు ఒక ఆయాను ఏర్పాటు చేయనున్నారు. వీరిని 10 నెలల కాల పరిమితితో స్థానికులను నియమించుకునేలా ప్రభుత్వం గైడ్‌లైన్స్ ఇచ్చింది. ఉపాధ్యాయుడికి ఇంటర్, ఆయాకు 8వ తరగతి విద్యార్హత ఉండాలనే నిబంధన విధించింది.

(మిగతా 8వ పేజీలో)


బాన్సువాడ పుట్ట వద్ద పూజలు నిర్వహిస్తున్న మహిళలు


నందిపేట కేదారేశ్వర ఆశ్రమంలో పూజలు చేస్తున్న భక్తులు


కలిగోట్‌లో పుట్ట శివాలయంలో


మద్నూర్‌లో పూజలు నిర్వహిస్తున్న మహిళలు


సర్ప దోష నివారణ పూజలు నిర్వహిస్తున్న మహరాజ్

భక్తి శ్రద్ధలతో నాగుల పంచమి

▸▸ ఇరు జిల్లాల్లో నాగదేవతకు ప్రత్యేక పూజలు ▸▸ కిక్కిరిసిన దేవాలయాలు

ఉమ్మడి జిల్లాలో మంగళవారం నాగుల పంచమిని భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. భక్తులు సమీపంలోని దేవాలయాల్లో పుట్టల్లో పాలు సమర్పించుకున్నారు. విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో చందూర్, మోస్రా మండల కేంద్రంలో ఉచిత ఆవు పాలు వితరణ చేశారు. కోటగిరి, పొతంగల్ మండలాల్లో సోదరిమణులు అన్నదమ్ములకు కళ్లను కడిగి కట్నకానుకలు స్వీకరించారు. ఆలూర్, ముప్కాల్,బాల్కొండ లోపుట్టల వద్ద పాలు, జొన్నపేలాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు. బాన్సువాడ పట్టణంలో నాగులపంచమి సందర్భంగా పట్టణంలోని పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భేతాళ స్వామి ఆలయం వద్ద నాగదేవత దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. ఆర్మూర్ పట్టణంలో గత 30 ఏళ్లుగా నాగుల చవితి రోజున ఆవుపాల పంపిణీని చేపడుతున్నారు. బీర్కూర్‌లో ఈ పండుగ సందర్భంగా బీర్కూర్‌లో మహిళలు ఉపవాస దీక్షలను ఆచరించారు. నాగులు పంచమి సందర్భరంగా నందిపేట మండల కేంద్రంలోని శ్రీ కేదారేశ్వర ఆశ్రమం, నందికేశ్వర ఆలయం, చింరాజ్‌పల్లి గ్రామ పంచా యతీ పరిధిలోని మల్లారంలో దర్గా వద్ద ఉన్న సాయిబాబ మందిరం, పోచమ్మ ఆలయం తదితర ఆలయాలు భక్తులతో కిటకిటలాయి. కలిగోట్ గ్రామంలోని పుట్ట శివాలయంలో నాగదేవతకు పుట్టలో పాలుపోసి మహిళలు మొక్కులు తీర్చుకున్నారు.పాలెం గ్రామంలో నా గమ్మ ఆలయంల వేద పండితులు రంజిత్‌కుమార్ శర్మ అభిషేకాలు, పూజలు నిర్వహించారు. బోధన్ పట్టణంలోని సంతాన నాగ దేవత ఆలయంలో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి తహసీల్దార్ విఠల్, కౌన్సిలర్ దాము తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవీపేట మండల కేంద్రంలోని లింగమయ్య గుట్ట ఆలయ వ్యవస్థాపకులు శ్రీ సిద్దేశ్వర మహరాజ్ శివాలయంలో నాగ పంచమి సందర్భంగా సర్ప దోష నివారణ పూజలు నిర్వహించారు. రెంజర్లలో నాగుల చవితి రోజు పుట్టలో పాలు పోస్తే ఈశ్వరుడి అనుగ్రహం ఉంటుందని ఉదయం నుండే ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

- నందిపేట/మోస్రా/కోటగిరి/ ముప్కాల్ / ఆర్మూర్/ బాన్సువాడటౌన్/పెర్కిట్/బీర్కూర్/జక్రాన్‌పల్లి/ మద్నూర్/కమ్మర్‌పల్లి/వేల్పూర్/మోర్తాడ్/డొంకేశ్వర్/ఎల్లారెడ్డి/బోధన్/ఎడపల్లి/నవీపేట/రెంజల్/నసురుల్లాబాద్

బీఎస్సీ అగ్రికల్చర్ కళాశాల ఏర్పాటుకు సన్నద్ధం

▸▸ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి


కళాశాల ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పోచారం

రుద్రూరు,జూలై29(ఆంధ్రజ్యోతి): రుద్రూర్ మండల కేంద్రంలోని వరి, చెరకు పరిశోధన కేంద్రంలో బీఎస్సీ అగ్రికల్చర్ కళాశాల ఏర్పాటుకు అనువైన ప్రదేశమని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం రుద్రూర్ పరిశోధన కేంద్రాన్ని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి పరిశీలించారు. కళాశాల ప్రిన్సిపాల్‌తో పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోనే కొత్త వంగడాలను సృష్టించే పరిశోధన కేంద్రం రుద్రూర్ వరి, చెరకు పరిశోధన కేంద్రం అని అన్నారు. 2016వ సంవత్సరంలో ఫుడ్ సైన్స్ టెక్నాలజీ కళాశాలను ఈ ప్రాంతానికి తీసుకొచ్చామన్నారు. ఈ ఫుడ్ సైన్స్ కళాశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధనతో పాటు నాణ్యమైన భోజనం, వసతి సౌకర్యం ఉందన్నారు. అదే విధంగా ఫుడ్ సైన్స్ కళాశాలకు సంబంధించిన సరిపడ గదులు, బాలుర, బాలికల వసతి గృహాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. పరిశోధన కేంద్రానికి 320ఎకరాల సొంత స్థలం ఉందని ఆయన వివరించారు. రుద్రూర్‌లో బీఎస్సీ అగ్రికల్చర్ కళాశాల ఏర్పాటుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడినట్లు పేర్కొన్నారు. నూటికి నూరు శాతం రుద్రూర్‌లో బీఎస్సీ అగ్రికల్చర్ కళాశాల ఏర్పాటుకు అనువైన ప్రదేశమని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, శాస్త్రవేత్తలు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తోట అరుణ్ కుమార్, మాజీ జడ్పీటీసీ నారోజి గంగారాం, నాయకులు పత్తి రాము, తోట సంగయ్య, అక్కపల్లి నాగేందర్, పత్తి లక్ష్మణ్, నడిపింటి నగేష్, షేక్ ఖదర్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ హాస్టల్‌లో నాణ్యమైన ఆహారాన్ని అందించాలి

▸▸ బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వసతి గృహాల్లో ఉంటున్న ప్రతీ విద్యార్థి ఆరోగ్యంగా ఉండాలని అందుకు అనుగుణంగా నాణ్యమైన ఆహారం అందించాలని మాజీ మంత్రి ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి సూచించారు. బాల్కొండ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ ఎస్సీ బీసీ వసతి గృహాల నిర్వహణ వసతి, ఆహార, శుభ్రత తదితర అంశాలపై వసతి గృహాల అధికారులు, సలహా కమిటి సమావేశంలో ఎమ్మెల్యే వేల్పూర్‌లో సమీక్ష నిర్వహించారు. నియోజక వర్గంలో ఎనిమిది ఎస్సీ ఐదు బీసీ వసతి గృహాలు ఉన్నాయని హాస్టల్‌లో వందలాది మంది పేద వెనుకబడిన తరగతులకు చెందిన విద్యార్థులు వసతి, భోజనం, విద్యా సదుపాయాలు పొందుతున్నారని అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. రోజువారిగా మెను ప్రకారం భోజనం అందించాలని వసతి గృహంలో పారిశుద్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, మురుగుదొడ్లు, స్నానాల గదులు రోజు శుభ్రంగా ఉంచాలని, విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభావం పడకుండా చూడాలన్నారు. శుభ్రత పాటించకపోవడం ఫుడ్ పాయిజన్ అయి విద్యార్థులు అస్వస్థతకు గురైన సంఘటనలు ప్రతీ రోజు జరుగుతున్నందున అలాటి పరిస్థితులు రాకుండ చూసుకోవాలన్నారు. విద్యార్థుల సమస్యలు తెలుసుకోవడానికి హస్టల్స్ సూపరింటెండ్‌లు వారానికి ఒకసారి ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలని సమస్యలు ఉంటే వెంటనే సంబందిత అధికారులతో సూచించారు. అధికారులందరు తమతమ బాధ్యతలను నిబత్తతతో నిర్వర్తించి హాస్టల్‌లను మరింత మెరుగు పర్చడానికి కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అసిస్టెంట్ షెడ్యుల్ కాస్ట్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ రాజ్ గంగారాం, అసిస్టెంట్ బ్యాక్ వర్డ్ కాస్ట్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ గంగాధర్, నియోజకవర్గంలోని హాస్టల్ వెల్ఫర్స్ అధికారులు, అధికారులు పాల్గొన్నారు.

ఆర్మూర్:ప్రజలకు చేసిన నిస్వార్థ సేవలు ఎంతో సంతృప్తినిస్తాయని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో


రికార్డులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

రెడ్డి సంఘం భవనంలో సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు స్వర్గీయ గడ్డం పైపుల రాజారెడ్డి విగ్రహాన్ని ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో లోక భూపతిరెడ్డి, విజయ్ విద్యాసంస్థల వ్యవస్థాపకురాలు అమృతలత, మారుతి రెడ్డి, హన్మంత్‌రెడ్డి, జీవి నర్సింహారెడ్డి, కాంతి గంగారెడ్డి, చరణ్‌రెడ్డి, సరిత రాజేశ్వర్‌రెడ్డి, సునితారెడ్డి, హేమంత్ రెడ్డి, మధుమతి, చిన్నవ్వ, విజయ, రెడ్డి సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ముప్కాల్: బీఆర్ఎస్ కార్యకర్తలపై ఎన్ని అక్రమ కేసులు పెట్టిన న్యాయస్థానంలోనే ధైర్యంగా ఎదుర్కొంటామని భారతీయ న్యాయ వ్యవస్థపై మాకు పూర్తి నమ్మకం, విశ్వాసం ఉందని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి మంగళవారం అన్నారు. ఇటీవల వేల్పూర్‌లో జరిగిన సంఘటనలో కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలపై హత్యయత్నం కేసులు పెట్టిన హైకోర్టు ఈ కేసులన్ని అక్రమ కేసులని స్పష్టం చేస్తు కార్యకర్తలకు బేయిల్ మంజూరు చేసిందని తెలిపారు. ఈ అక్రమ కేసులు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్ కార్యకర్తలు మహేష్, నితిష్, లాలా, రహమాన్, గంగాధర్‌గౌడ్‌లను వారి కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించి మనోధైర్యాన్ని ఆ కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు.

ప్రభుత్వం సర్వే చేసి పేదలను ఆదుకోవాలి

బోధన్,జూలై29(ఆంధ్రజ్యోతి): పొతంగల్ మండల కేంద్రంలోని గ్రామ శివారులో గల సర్వే నెంబర్ 632, 34 పరిధిలో భూములను సబ్ డివిజన్ చేసి ఇవ్వాల్సిందిగా తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతోకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ సర్వే నెంబర్ పరిధిలో గల భూములను పేదలకు 1991లో అప్పటి ప్రభుత్వం పట్టాలు జారీ చేసిందని ఇందులో దళితులు, గిరిజనులు అత్యంత పేదలకు వ్యవసాయం చేసుకొనుటకు జీవనం కొనసాగిస్తున్నారన్నారు. కొందరు ధనిక రైతులు పేదల పొలాలను బలవంతంగా దున్నుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ విషయమై అడిగితే దురుసుగా ప్రవర్తిస్తున్నారని సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. మొత్తం భూమిని సర్వే చేసి ఇవ్వాలన్నారు. ధనిక రైతులపై చర్యలు తీసుకోవాలని కోరారు. పోలీసులు, రెవెన్యూ సిబ్బంది విచారణ జరిపి వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకట్, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు శంకర్ గౌడ్, వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ఏశాల గంగాధర్, బాధితులు శకుంతల, శంకర్, హబీషాబ్, ఖదర్ బీ, చాకలి సాయన్న, మేదరి నారాయణ, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.


సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘ సభ్యులు

క్రైం సమాచారం

కల్లు కంపౌండ్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతి

సుభాష్‌నగర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వీక్లీమార్కెట్ కల్లు కంపౌండ్ వద్ద సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు నిజామాబాద్ 1టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. వ్యక్తి వయస్సు 45 - 50 సంవత్సరాల మధ్య ఉందని కల్లు దుకాణం వద్ద అపస్మారక స్థితిలో ఉన్న అతన్ని 108లో జిల్లా ఆసుపత్రికి తరలించగా అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారని అన్నారు.మృతి సమాచారం ఎవరికైనా తెలిస్తే 1వ టౌన్ పోలీసులను సంప్రదించాలన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

బోధన్,జూలై29(ఆంధ్రజ్యోతి): మంజీర సరిహద్దు గ్రామాల నుండి అక్రమంగా తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నామని బోధన్ రూరల్ ఎస్ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపారు. మందర్నా, ఖండ్‌గావ్ తదితర ప్రాంతాల నుండి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నారని ఆయన తెలిపారు. ప్రభుత్వ అనుమతులు ఉన్న ట్రాక్టర్లు మాత్రమే ఇసుకను తరలించాలన్నారు. లేనియెడల కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

నవీపేట,జూలై29(ఆంధ్రజ్యోతి): రాత్రిపూట దొంగతనాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ వినయ్ కోరారు. ఇటీవల జిల్లాలో తాళం వేసిన ఇళ్లలో తరచుగా దొంగతనాలు జరుగుతున్నాయని ఈ విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. గ్రామంలో ఎవరైన కొత్త వ్యక్తులు అనుమానస్పదంగా సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

గడ్కోల్లో తాళాలున్న ఇళ్లల్లో చోరీ

సిరికొండ, జూలై 29 (ఆంధ్రజ్యోతి) సిరికొండ మండలం గడ్కోల్ గ్రామంలో సోమవారం రాత్రి తాళాలున్న ఆరు ఇళ్లల్లో దొంగలు పడ్డారు. గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మల్కి నరేష్ ఇంట్లో తాళంపగుల గొట్టి చొరబడ్డారు ఇంట్లో సీసీ కెమెరాను గమనించిన దొంగలు కెమెరాలపైబట్టలు కప్పి తులంమూడు గ్రామాలు బంగారాన్ని దొంగిలించారు.ఎండీ యాదులో ఇంట్లో పదివేల నగదు,15 తులాల వెండిని దొంగతనానికి పాల్పడ్డారు.మేర గంగాదాస్ ఇంట్లో చొరబడి నాలుగు నాలుగు వేలు,వెండి. బాబన్న ఇంట్లో కూడ దొంగలు పడి వస్తు వులను చిందర వందర చేశారు. మిగిలిన ఇళ్లల్లో ఏమి పోలేదని గ్రామస్తులు చెప్పారు. పోలీసులు మాత్రం కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ముప్కాల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): బాల్కొండ మండలంలోని వివిధ గ్రామాలలో ఇటీవల జరిగిన చోరీలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై శైలేందర్ తెలిపారు. దొంగలు తాళం వేసిన ఇళ్లనే లక్ష్యంగా చేసుకొని చోరీలకు పాల్పడుతున్నారన్నారు. ఇంటికి తాళం వేసి ఇతర గ్రామాలకు వెళ్లే వారు పోలీస్ స్టేషన్‌లో, చుట్టు పక్కల వారికి చెప్పి వెళ్లాలని సూచించారు. గ్రామాలలో అపరిచితులు సంచరిస్తే తమకు సమాచారం ఇవ్వాలన్నారు.

ఒకరికి ఏడురోజుల జైలు శిక్ష

ఆర్మూర్ టౌన్ , జూలై 29 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌కు చెందిన మోయినోద్దిన్‌కు మార్నింగ్ కోర్టు న్యాయాధికారి గట్టు గంగాధర్ ఏడు రోజుల సాధారణ జైలు శిక్ష విధించినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. పెర్కిట్‌లోని నిబంధనలకు విరుద్ధంగా హోటల్‌ను అర్ధరాత్రి వరకు తెరిచి ఉంచడంతో కోర్టులో హాజరు పర్చగా జైలు శిక్ష విధించినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

గొర్రెలకు నీలి నాలుక వ్యాధి నివారణ టీకాలు

మాక్లూర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్యాట్‌పల్లి గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం గొర్రెలకు నీలి నాలుక వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు మండల పశువైద్యాధికారులు డాక్టర్ కిరణ్‌దేశ్ పాండే, డాక్టర్ ఉమమతాహేర్ లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీలి నాలుగ వ్యాధి ప్రధానంగా నోరు, ముక్కు నీరు కారడం, జ్వరం, లాలాజలం కారడం లాంటివి ఉంటాయని వారన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది వినీత, కళ్యాణి, షైమద్ తో పాటు రైతులు పాల్గొన్నారు.

బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు

రుద్రూరు,జూలై29(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం రుద్రూర్ మండల కేంద్రంలోని చాయ్ హోటళ్లలో అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఓ హోటల్‌లో బాల కార్మికుడు పని చేస్తుండగా ఆ బాల కార్మికుడికి కౌన్సిలింగ్ నిర్వహించి వారి తల్లిదండ్రులకు అప్పజెప్పారు. అదే విధంగా హోటల్ యాజమానులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. బాల కార్మికులను పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆపరేషన్ ముస్కాన్ ఎస్ఐ పీటర్, కానిస్టేబుల్‌లు సతీష్ కుమార్, గంగాధర్, సాయికుమార్, కృష్ణ కుమారి పాల్గొన్నారు.

బీహార్‌లో 1949యాక్ట్‌ను రద్దు చేయాలి

బోధన్,జూలై29(ఆంధ్రజ్యోతి): బీహార్‌లో 1949యాక్ట్‌ను రద్దు చేయాలని మంగళవారం బుద్దిస్ట్ బిక్షుల ఆధ్వర్యంలో ఆచన్‌పల్లి నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తాలో తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా భంతే బుద్ద ఘోస్ మాట్లాడుతూ ప్రపంచానికి బుద్దుడు జ్ఞానోదయం పొందిన పవిత్ర ధర్మభూమి ఈ దేశం అని అదే భూమిలో బౌద్దులు పరాయి వారిలా ఉండాల్సి వస్తుందని, ఇది భారత రాజ్యాంగానికి, బౌద్ద ధర్మానికి పూర్తి విరుద్ధమన్నారు. మహ బోధి విముక్తి ఉద్యమం అంటే బోధ్ గయాలో బుద్దుని జ్ఞానోదయ స్థలమైన మహ బోధి మహ విహార్‌ను పూర్తిగా బౌద్దుల నియంత్రణలోకి తీసుకురావాలన్న లక్ష్యంతో దేశవ్యాప్తంగా బౌద్దులు గొప్ప చారిత్రక ఉద్యమం చేస్తున్నారన్నారు. ఉద్యమంలో భాగంగా పూజ్య బిక్షుభంతే బుద్దఘోస్ ఆధ్వర్యంలో జూలై 21నుండి 10రోజుల శ్రామణేర్ శిబిరం శాంతియుత ధర్నా ప్రదర్శన జరుగుతుందన్నారు. 1949 యాక్ట్ అంటే బోధ్ గాయా దేవాలయం బీహార్ ప్రభుత్వం రూపొందించిన చట్టం ప్రకారం మహ బోధి మందిరాన్ని నిర్వహించేందుకు ఏర్పాటు చేసిన ట్రస్టు బోర్డులో బౌద్దులు మెజారిటీలో ఉండకూడదు అన్న నిబంధన ఉంది. ప్రపంచ బౌద్ద సంస్కృతి కేంద్రమైన ఈ స్థలంపై బౌద్దులకు పూర్తి హక్కు ఉండకపోవడం వల్ల ఒక విధమైన ధార్మిక అన్యాయం నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో భంతే బుద్ద ఘోస్, భంతే నాగవజ్ర, టీబీ ఎస్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు అశోక్ భాగ్యవన్, సమత సైనిక్ దళ్ జిల్లా సంఘటకులు కపిల్ కాలేవార్, బుద్దిస్ సోసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షులు దేవిదాస్ కాంబ్లే, కార్యదర్శి దయానంద్, ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ కమిటీ బోధన్ డివిజన్ కమిటీ కన్వీనర్ ఈశ్వర్, కోకన్వీనర్ నీరడి రవి, సింగాడే పాండు, కొండ్ర వెంకటి, వాగ్మారే సూర్యకాంత్, దాసరి శ్యామ్, రాహుల్, సాయిలు, కపిల్, సాగర్, చరణ్‌లతో వివిధ మండలాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.


బోధన్ అంబేద్కర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేస్తున్న బౌద్దులు

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

కమ్మర్‌పల్లి, జూలై 29: (ఆంధ్రజ్యోతి) మండలంలోని హసాకొత్తూర్ మారుతినగర్ వడ్డర కాలనికి చెందిన ఇరుగుదిండ్ల శేఖర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మరణించగా బాధితుడి కుటుంబానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి తనవంతుగా రూ.10 వేలరూపాయలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ బీజేపీ నాయకులు రాదారపు సతీష్, దామోదర్, గడ్డం రాజేశ్వర్, బంగ్ల రమేష్, బంగ్ల దేవదాస్, ప్రదీప్ గోపిడి శేఖర్, ఎర్రం నవీన్, కట్ట రాజు, అయోధ్య నరేష్, సామ మహిపాల్ పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలి

బోధన్,జూలై29(ఆంధ్రజ్యోతి): ప్రజలు తప్పకుండా ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలని బోధన్ ట్రాఫిక్ సీఐ చందర్ రాథోడ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని పలు దుకాణ సముదాయాలను ఆయన పరిశీలించారు. రహదారులకు ఇరువైపులా దుకాణసముదాయాలు, ఇతర వ్యాపార నిర్వాహకులు తమ దుకాణానికి సంబంధించిన బోర్డులను ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ వెంకట నారాయణ, రిలయన్స్ స్మార్ట్ నిర్వాహకులు సతీష్ కుమార్, మారుతి పటేల్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణం తనిఖీ

రెంజల్,జూలై29(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ఫర్టిలైజర్ షాపులలో మంగళవారం మండల వ్యవసాయ శాఖ అధికారి సిద్దిరామేశ్వర్, రెంజల్ ఎస్ఐ చంద్రమోహన్ సంయుక్తంగా ఎరువుల డీలర్ షాపులలో ఆకస్మిక తనిఖీలు చేశారు. కాలం చెల్లిన పురుగులు మందులు దుకాణంలో ఉంచకూడదని, రైతులకు మందులను ఇచ్చేటప్పుడు తప్పకుండా బిల్లులు ఇవ్వాలని గడ్డి మందులు రైతులు అడిగినప్పుడు వారికి పనికి వస్తుందా లేదా కనుక్కొని ఇవ్వాలన్నారు. ప్రతి దుకాణదారులు ఎరువులకు సంబంధించిన రికార్డులలో వివరాలను తప్పకుండా నమోదు చేయాలన్నారు. వారి వెంట వ్యవసాయశాఖ సిబ్బంది, పోలీసు సిబ్బంది ఉన్నారు.

స్థలం స్వాధీనం చేసుకోవడంపై ముదిరాజుల నిరసన

కోటగిరి,జూలై29(ఆంధ్రజ్యోతి): పొతంగల్ మండల కేంద్రంలోని పాత పొతంగల్ గ్రామంలో పంచాయతీ అధికారులు తమ అధీనంలో ఉన్న స్థలాన్ని స్వాధీనం చేసుకోవడంపై ముదిరాజ్ సంఘం నాయకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన చేపట్టారు. ఖాళీ స్థలంలో ముదిరాజ్ సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మించేందుకు పనులు ప్రారంభించారు. ఇటీవల గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో ఖాళీ స్థలం గుర్తించి ఇవ్వాలని గ్రామస్థులకు సూచించారు. పంచాయతీ అధికారులు ఖాళీగా ఉన్న స్థలాన్ని స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేయడంతో ముదిరాజ్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖాళీ స్థలం తమ అధీనంలో ఉండగా స్వాధీనం చేసుకోవడం సరికాదని, ప్రభుత్వ భవనం నిర్మాణానికి ఇతర స్థలం కేటాయించాలని కోరారు. తమ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి అనుమతించాలని వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు హన్మాండ్లు, శంకర్, సాయిలు, గంగారాం, వీరేశం, సాయన్న, గణేష్, నాగయ్య తదితరులున్నారు.

గుత్పలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పరిశీలన

ఆలూర్ , జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఆలూర్ మండలం గుత్ప గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లను ఎంపీడీవో గంగాధర్, కాంగ్రెస్ నాయకులు జితేందర్ పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించడం వల్ల చాలా మంది ఈ ఐదు లక్షల సాయం అందడం వల్ల ప్రతీ గ్రామంలో ఇళ్లులేని నిరుపేదలు తప్పనిసరిగా నిర్మించు కోవాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ఇందిరమ్మ కమిటి సభ్యులు, గ్రామ సెక్రటరీ పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో బీడీ స్కాలర్‌షిప్ దరఖాస్తు చేసుకోవాలి

ముప్కాల్ , జూలై 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ విద్యాసంస్థల్లో చదువుతున్న బీడీ కార్మికుల పిల్లలు స్కాలర్ షిప్ కొరకు దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాధికారి బట్టు రాజేశ్వర్ తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి విద్యార్థుల ప్రోత్సాహక స్కాలర్ షిప్ కోసం ఆన్‌లైన్‌లో 1 నుంచి పదోతరగతి చదువుతున్న విద్యార్థులు ఆగస్టు 31 లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అలాగే ఇంటర్ నుంచి డిగ్రీ ప్రొఫెషనల్ కోర్సులు చదువుకునే విద్యార్థులకు అక్టోబరు 31 వరకు గడువు ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. దరఖాస్తులు చేసుకొనే విద్యార్థులు పాస్‌మార్కుల మెమో, బ్యాంక్ పాస్‌బుక్, ఆధార్‌కార్డు, కుల ఆదాయ ధ్రువీకరణ పత్రం, కార్మికురాలి బీడీ కంపెనీ గుర్తింపు కార్డు, అపాయిమెంట్ లెటర్ కలిగి ఉండాలి. హెల్ప్‌సెంటర్ 01206619540 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పొలంబాట

కోటగిరి,జూలై29(ఆంధ్రజ్యోతి): కోటగిరి మండలంలోని యాద్గార్‌పూర్ గ్రామంలో మంగళవారం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పొలంబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈ బుజ్జిబాబు మాట్లాడుతూ రైతులు నాణ్యమైన విద్యుత్ పరికరాలను వినియోగించుకోవాలన్నారు. విద్యుత్ ప్రమాదాలపై అవగాహన కల్పించారు. స్టార్టర్లకు కెపాసిటర్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. విద్యుత్ తీగలు వేలాడితే సమాచారం అందించాలని, రైతులు మరమ్మత్తు చర్యలు చేపట్టవద్దని సూచించారు. విద్యుత్ సమస్యలపై తమకు సమాచారం అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు, విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉచిత యోగా శిక్షణ తరగతులు

తాడ్వాయి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంకల్ గ్రామంలో గత పది రోజుల నుండి ఉచిత యోగ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు సంతోష్ రెడ్డి తెలిపారు. ఈ శిక్షణ తరగతులు పతాంజలి యోగ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో సంతోష్ రెడ్డి, తిరుపతిరెడ్డి, వెంకట్ రెడ్డి, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

రేషన్ కార్డుల పంపిణీ

తాడ్వాయి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రపహడ్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రేషన్ కార్డులను పంపిణీ చేశారు. అనంతరం మండల అధ్యక్షుడు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి పథకాలను గడప గడపకు తీసుకొని వెళ్లాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బద్దం మల్లేష్ రెడ్డి, ఉపాధ్యక్షులు గైని రాజలింగం, సెక్రటరీ శ్రీనివాస్ గౌడ్, మండల్ అధ్యక్షులు వెంకట్ రెడ్డి, మహేందర్ రెడ్డి, యూత్ అధ్యక్షులు అఖిల్ రావు, సమన్వయ కమిటీ మెంబర్స్ తిప్పారావు, మోహన్ రెడ్డి, లక్ష్మణాచారి, తదితరులు పాలొగొన్నారు.

ట్రిపుల్ ఐటీకి బాల్కొండ విద్యార్థులు

ముప్కాల్,జూలై 29 (ఆంధ్రజ్యోతి): ట్రిపుల్ ఐటీ క్యాంపస్ విడుదల చేసిన చివరి విడతలో బాల్కొండప్రభుత్వ పాఠశాలకు చెందిన బొట్లస్ఫూర్తి ఎంపికైనట్లు ఎంఈవో బట్టు రాజేశ్వర్ తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2025-26 విద్యాసంవత్సరానికి మొత్తం ఆరుగురు విద్యార్థులు ఎంపికైనట్లు ఆయన తెలిపారు.

సినారెకు ఘన నివాళి

కామారెడ్డిటౌన్, జూలై 29(ఆంధ్రజ్యోతి): సినారె జయంతి సందర్భంగా మంగళవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కర్షక్‌బీఈడీ కళాశాలలో తెరవే ఆధ్వర్యంలో ఆయన చిత్రపటం వద్ద ఘన నివాళ్లు అర్పించారు.ఈ సందర్భంగా తెరవే జిల్లా అధ్యక్షుడు గఫూర్‌శిక్షక్ మాట్లాడుతూ విశ్వంభర జ్ఞానపీఠ పురస్కారాన్ని అందుకుని తెలంగాణ ప్రాంతానికి ఎంతో కీర్తితెచ్చిన కవి సినారె అని అన్నారు. ఈ కార్యక్రమంలో కవులు లింగం, నాగభూషణం, సుధాకర్, సాయిప్రభ,బాలరాజయ్య, చంద్రకాంత్, సంధ్య పాల్గొన్నారు.

తాడ్వాయిలో జడ కొప్పులాట

తాడ్వాయి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నాగుల చవితి సందర్భంగా గ్రామస్తులు జల కొప్పులాట కోలాటం ఆడి కనువిందు చేశారు.గ్రామంలో ప్రతి సంవత్సరం నాగుల పంచమి రోజున జడ కొప్పుల కోలాటం ఆడుతామని సభ్యులు తెలిపారు. ఇందులో జడకొప్పుకోలాటం సభ్యులు, తాడ్వాయి గ్రామస్తులు ఉన్నారు.

అంతర్జాతీయ పులుల దినోత్సవం

లింగంపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని మంగళవారం ఎల్లారెడ్డి అటవీ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మైనారిటి గురుకుల కళాశాలలో విద్యార్థులతో కలిసి అటవీ అధికారులు సేవ్ ద టైగర్ సేవ్ ద నేషన్ అనే నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ బీట్ అధికారులు చంద్రశేఖర్, లింగయ్య, కళ్యాణి, శ్రీజ, షర్పీన్‌లు ఉన్నారు.

ఖరీఫ్ సాగుకు ఢోకా లేదు

» పోచారం ప్రాజెక్టులో 16.6 అడుగులకు చేరిన నీటిమట్టం » ఆయకట్టు రైతుల్లో ఆనందం

నాగిరెడ్డిపేట,జూలై 29 (ఆంధ్రజ్యోతి): పోచారం ప్రాజెక్టులో నీటిమట్టం 16.5 అడుగులకు చేరడంతో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఆయకట్టు సాగు భూములకు నీటి ఢోకాలేదని ఆయకట్టు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యం 205. అడుగులు (1.820 టీఎంసీలు) కాగా మంగళవారం నాటికి ప్రాజెక్టులో 16.5 అడుగులకు (1.198 టీఎంసీలు) చేరింది. దీంతో ప్రాజెక్టు ఆయకట్టు సాగు భూములకు ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో సాగునీటికి ఢోకా లేకుండా అయింది. వర్షాకాలం ప్రారంభమై నెల రోజులు గడిచినా అనుకూలమైన వర్షాలు కురియకపోవడంతో గత వారం రోజుల క్రితం వరకు ప్రాజెక్టులోకి చుక్క నీరు రాలేదు. దీంతో ప్రాజెక్టులో నీటి మట్టం డెడ్ స్టోరేజీకి చేరగా, ప్రస్తుతం ఖరీఫ్ సాగు ప్రశ్నార్థకంగా మారి ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్న తరుణంలో వరుణ దేవుడు కరుణించాడు. గత ఐదు రోజులు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాల కారణంగా ప్రాజెక్టులో నీటి మట్టం క్రమక్రమంగా పెరిగి 16.5 అడుగులకు చేరింది. నాగిరెడ్డిపేట,ఎల్లారెడ్డి మండలాలకు వరప్రదాయిని అయిన పోచారం ప్రాజెక్టు ఈ రెండు మండలాలకు చెందిన అధికారికంగా 10,500 ఎకరాల సాగు భూములకు ఖరీఫ్ సీజన్‌లో సాగు నీటిని అందిస్తుండగా, అనధికారింగా రెండు మండలాలకు చెందిన సుమారు 20 వేల ఎకరాల భూములకు సాగు నీటిని అందిస్తోంది. ప్రాజెక్టు నీటిమట్టం 16.5 అడుగులకు చేరడంతో ఆయకట్టు రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది.

● గత సంవత్సరం ఆగస్టు 15న పోచారం నీటిని విడుదల చేసిన ఛీఫ్ ఇంజనీర్

ఖరీఫ్ పంటల సాగు కోసం పోచారం ప్రాజెక్టులో అవసరమైనంత మేరకు నీరు నిల్వ ఉన్నట్లయితే ప్రతియేటా నీటి పారుదల శాఖ అధికారులు ఆగస్టు 15న పోచారం ప్రాజెక్టు ప్రధాన కాలువ ద్వారా నీటిని విడుదల చేస్తారు. గత కొన్ని సంవత్సరాలుగా ఆగస్టు 15న పోచారం ప్రాజెక్టు నీటిని అధికారులు విడుదల చేస్తున్నారు. గత సంవత్సరం 2024లో ఆగస్టు 15 నాటికి ప్రాజెక్టులో 20.5 అడుగులు (1.142 టీఎంసీలు) నీరు నిల్వ ఉండటంతో ఆయకట్టు భూములకు ఖరీఫ్ పంటల సాగు కోసం ఆగస్టు 15న పోచారం ప్రాజెక్టు నీటిని జిల్లా నీటి పారుదల శాఖ ఛీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్ విడుదల చేశారు. గత సంవత్సరం కంటే అధికంగా ప్రస్తుతం ప్రాజెక్టులో 16.5 అడుగులు (1.198 టీఎంసీలు) నీరు నిల్వ ఉండటంతో ఖరీఫ్ సాగు కోసం పాజెక్టు నీటిని విడుదల చేసేందుకు నీటి పారుదల శాఖ అధికారులు తగు చర్యలు తీసుకుంటున్నారు.



పోచారం ప్రాజెక్టు

● ప్రభుత్వ అనుమతి రాగానే నీటిని విడుదల చేస్తాం : వెంకటేశ్వర్లు, డీఈ, ఎల్లారెడ్డి నీటి పారుదల శాఖ

ప్రభుత్వ అనుమతులు రాగానే పోచారం పారజెక్టు ద్వారా నీటిని విడుదల చేస్తాం. పోచారం ప్రాజెక్టులో 1.820 టీఎంసీలకు గాను ప్రస్తుతం ప్రాజెక్టులో 1.198 టీఎంసీల నీరు ఉంది. ఖరీఫ్ సాగు కోసం నీటి విడుదల విషయమై ప్రభుత్వానికి లేఖను రాశాం. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే ప్రాజెక్టు ప్రధాన కాల్వ ద్వారా నీటిని విడుదల చేస్తాం.





ప్రాజెక్టులో 16.5 అడుగులకు చేరిన నీటిమట్టం

నీటి సరఫరా నిర్మాణంపై
నిర్లక్ష్యమేలా?



ధ్వంసమైన సిమెంట్ దిమ్మెలు

» మరమ్మతులు లేక శిథిలావస్థలో పెద్ద వాగు సైఫన్
» ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణం చేయాల్సిందే
» అక్రమ రవాణాకు అడ్డా... కొరవడిన అధికారులు పర్యవేక్షణ

ఏర్గట్ల, జులై 29 (ఆంధ్రజ్యోతి): నాలుగున్నర దశాబ్దాలు పూర్తి చేసుకున్న ఆక్విడక్ట్ సైఫన్‌కు కనీస మరమ్మతులు లేక క్రమేపీ శిథిలావస్థకు చేరుకుంటోంది. ఆక్విడక్ట్ నిర్మాణం పూర్తి చేసుకున్నప్పటి నుంచి ఇప్పటి వరకు మరమ్మతులకు నోచుకోక ప్రమాదపు అంచులో ఉంది. మండలంలోని తొర్తి గ్రామ శివారులో ఉన్న ఈ ఆక్విడక్ట్ 1971లో నిర్మించగా దాన్ని అప్పటి నీటి పారుదల శాఖ మంత్రి నీలం సిద్దారెడ్డి ప్రారంభించారు. నిపుణులతో ఎంతో కళాత్మకంగా కాకతీయ కాలువ 16.90వ కిలో మీటర్ వద్ద నిర్మాణ పనులు చేపట్టారు. తొర్తి గ్రామ శివారు గుండా ప్రవహించే పెద్ద వాగును దాటించేందుకు అప్పటి నిపుణులు ఈ ఆక్విడక్ట్ సైఫన్‌ను నిర్మించారు. ఈ ఆక్విడక్ట్ పై భాగం నుంచి ఎస్సారెస్పీ కాలువ నీరు ప్రవహిస్తుండగా, క్రింది భాగం గుండా పెద్ద వాగు నీరు ప్రవహిస్తోంది. అయితే ఆక్విడక్ట్ నిర్మితమైన స్థలంలోనే నీటి ఒత్తిడిని అధికంగా ఉండటం వల్ల అందులో నాలుగు చానెళ్ల ద్వారా పైన విభజించి నీరు వెళ్లే విధంగా ఏర్పాటు చేశారు.

శిథిలావస్థలో సైఫన్

ఎంతో కళాత్మకంగా నిర్మించిన ఈ ఆక్వడక్ట్ సైఫన్ పైన ఒక వైపు ద్విచక్ర వాహనాలు, మరో పక్క పాదచారులు నడవడానికి వీలుగా రోడ్డును ఏర్పాటు చేశారు. మరో వైపు కార్లు తదితర వాహనాలు వెళ్లే విధంగా రోడ్డును ఏర్పాటు చేశారు. అయితే ఆక్వడక్ట్‌పై ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన రేయిలింగ్‌లు పూర్తిగా దెబ్బ తినడంతో నాలుగేళ్ల క్రితం కొద్దిగా మరమ్మతులు చేసి వదిలేశారు. నిత్యం ఈ ఆక్వడక్ట్ మీదుగా వంద సంఖ్యలో ముప్కాల్, బాల్కొండ మండలాలకు ప్రజలు వెళుతుంటారు. ఏ మాత్రం అశ్రద్ధ వహించినా ప్రాణాలు గాలిలో కలిసిపోయే ప్రమాదం ఉంది. ఆక్విడక్ట్‌పై పర్యవేక్షణ లేకపోవడంతో సిమెంట్ దిమ్మెలు అక్కడక్కడ ధ్వంస్వమయ్యాయి. వాటికి ఏర్పాటు చేసిన ఇనుప రాడ్లు దొంగలపాలయ్యాయి.



పెద్ద వాగుపై ఉన్న ఆక్విడక్ట్ సైఫన్

అక్రమ రవాణాకు అడ్డా

శివారు ప్రాంతంలో ఈ ఆక్విడక్ట్ ఉండటం వల్ల రాత్రి వేళలో కలప, ఇసుక అక్రమ రవాణాకు అడ్డగా మారింది. ఈ ప్రాంతం నుంచి రవాణా సాగిస్తే పెద్దగా అధికారులు దృష్టి పెట్టరనే ఉద్దేశంతో అక్రమ రవాణా సాగిస్తున్నారు. భారీ లోడ్‌తో వాహనాలు ఆక్విడక్ట్ నుంచి వెళ్లడంతో మరింత ప్రమాదకరంగా మారుతోంది. అయినా పట్టించుకునే అధికారులు లేరు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు బిల్లులు

ఎల్లారెడ్డి రూరల్, జూలై 29(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను చేపట్టిన లబ్దిదారులకు విడతల వారీగా బిల్లులు అందుతాయని ప్రకటించిన విధంగా సకాలంలో బిల్లులు రావడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఎల్లారెడ్డి మండల పరిదిలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన లబ్దిదారులకు బేస్మెంట్ నిర్మాణం పూర్తి కాగానే నిబంధనలో పేర్కొన్న విధంగా సకాలంలో బిల్లులు లబ్దిదారులకు బ్యాంకు ఖాతాలో మొదటి విడత బేస్మెంట్ బిల్లు రూ.లక్ష జమ కావడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా లబ్దిదారులు శివరాణి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇల్లు మంజూరైనప్పటికి లబ్దిదారులు సకాలంలో బిల్లులు అందవని కొంతమంది అసత్య ప్రచారాలు చేయడంతో ఆందోళన చెందామని, ఇప్పుడు వెంట వెంటనే బిల్లులు రావడంతో ఎటువంటి భయం లేదని అన్నారు. సరైనా ఇల్లు లేక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోన్నామని, నాలాంటి పేదలకు ఇండ్లు మంజూరు చేయడంలో గత ప్రభుత్వ పాలకులు విఫలమయ్యారని పేర్కోన్నారు. లబ్దిదారులు కాంగ్రెస్ ప్రభుత్వానికి, స్థానిక ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావుకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ప్రతీ ఒక్కరు పరిసరాల పరిశుభ్రత పాటించాలి

● టీబీ ప్రోగ్రాం అధికారి రాధిక

మాచారెడ్డి, జూలై 29(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని టీబీ ప్రోగ్రాం అధికారిణీ రాధిక అన్నారు. మంగళవారం పాల్వంచ మండలంలోని భవానీపేట్ గ్రామపంచాయతీ పరిధిలోని కిషన్‌నగర్ ను పర్యటించి కాలనీవాసులను ఉద్దేశించి మాట్లాడారు. కాలనీలో డెంగ్యూ కేసులు విషజ్వరాలపై అవగాహన కల్పించారు. కుళాయిలలో, గుంతల్లో, టైర్లు తదితర వాటిల్లో వర్షం నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. నీరు నిల్వ ఉండటంతో వాటిపై దోమలు గుడ్లుపెట్టి వ్యాప్తి చెందుతాయని, ఆ దోమలు కుట్టడం వలన జ్వరాలు, డెంగ్యూ వంటి వ్యాధులు ప్రబలుతాయన్నారు. ఇంటి చుట్టూ తప్పకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి కుళాయిలు ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలన్నారు. కాచీ చల్లాచిర్చన నీటినే తాగాలని, జ్వరాలు వచ్చిన వెంటనే ఆసుపత్రికి వెళ్లి వైద్యం చేయించుకోవాలన్నారు. కుష్టు వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మాచారెడ్డి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఆదర్శ్, వైద్య సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.

నేషనల్ లెవల్ మానిటరింగ్ కమిటీ పర్యటన

వేల్పూర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలంలోని కోమన్‌పల్లి, అక్లూర్, వేల్పూర్ గ్రామాలలో మంగళవారం నేషనల్ లేవల్ మానిటరింగ్ కమిటీ సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలోని గ్రామ పంచాయితీ కార్యాలయాలలో వారు గ్రామ సభలు నిర్వహించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాల నిధుల అమలు గురించి గ్రామ సభల్లో కూలీలను వారు అడిగి తెలుసుకున్నారు. ఆయా గ్రామాలలో ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన పనులను వారు పరిశీలించారు. ఐకేపీ ద్వారా మంజూరైనా రుణాల వల్ల మహిళలు ఆర్థికంగా ఎదగడానికి దోహద పడుతాయని, తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించాలని సూచించారు. వేల్పూర్‌లో ఈత ప్లాన్‌టేషన్ ను సందర్శించి సంబంధిత రైతులతో ఆ పథకం అమలు గురించి ఆరా తీశారు.అక్లూర్ గ్రామంలో సీసీ రోడ్లను పరిశీలించి, అంగన్‌వాడి సెంటర్లలో కొనసాగుతున్న వసతుల కల్పనపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎల్ఎల్ఎం టీం సభ్యులు సుధాకర్‌రెడ్డి, లోహిత్‌రెడ్డి, ఎంపీడీవో బాలకిషన్, ఎంపీవో సాయిలు, ఈజీఎస్ ఏపీవో అశోక్, పంచాయితీ రాజ్ ఈఈ, డీఈ, ఏఈ , ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్, లు తదితరులు పాల్గొన్నారు.

పంటను పరిశీలించిన వ్యవసాయాధికారులు

ఆర్మూర్ , జూలై 29 (ఆంధ్రజ్యోతి): పెర్కిట్‌లో మంగళవారం వ్యవసాయాధి కారులు మొక్కజొన్న, వరి పంటలను పరిశీలించారు. మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు ఉధృతీ ఎక్కువగా ఉంటే నివారణకు ఇమామెక్టిన్ బెజోయేట్ 0.4 మిల్లీ లీటర్లు లేదా క్లోరాంట్రా నీలిప్రోల్ 0.4 మిల్లీ లీటర్లు ఒక లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. వరిపొలం నాటిన 18 నుంచి 20 రోజులలో కాండం తొలుచు పురుగు నివారణకు కార్బోఫ్యూరాన్ 3 జీ గులకలు 10 కిలోలు 8 కిలోల ఇసుకలో కలిపి చల్లుకోవాలని వ్యవసాయాధికారి హరికృష్ణ సూచించారు. ఈ కార్యక్రమంలో పెర్కిట్ సొసైటీ చైర్మన్ బోజారెడ్డి, ఏఈవోలు రచన, అనూష, రైతులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి : టీయూసీఐ

వేల్పూర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం రద్దు చేయాలని టీయుసీఐ జిల్లా నాయకులు జి. అరవింద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వేల్పూర్ మండలం లక్కోర గ్రామంలోని పీకేటీపీ బీడీ సెంటర్ వద్ద కార్మికులతో సమస్యలతో కూడిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో టీయుసీఐ నాయకులు గంగాధర్, లింబాద్రి, అన్వర్, కార్మికులు పద్మ, హేమలత, సాయన్న, రాజేందర్; మురళి, రమేష్, స్రవంతి, జగదీష్, రెడ్డన్న బుచ్చిరాములు, హన్మాండ్లు, తదితరులు పాల్గొన్నారు.

మద్నూర్ - బోధన్ రోడ్డు విస్తరణ పనుల గుర్తింపు

» రూ.634 కోట్ల అంచనాతో 39 కిలో మీటర్లు

మద్నూర్,జూలై 29 (ఆంధ్రజ్యోతి):మద్నూర్ - బోధన్ జాతీయ రహదారి నిర్మాణానికి కేంద్రప్రభుత్వం 2025-26 తెలంగాణ వార్షిక ప్రణాళికలో కేంద్ర రోడ్డు రవాణాశాఖ ఖరారు చేసింది. 161బి మద్నూర్ బోధన్ సెక్షన్‌లో 39కి మీ. మేరరోడ్డు విస్తరణ డీపీఆర్‌ను సిద్ధం చేస్తున్నారు. రూ.634 కోట్ల అంచనా మేరకు పను లు ప్రారంభం కానున్నాయి. మద్నూర్ నుంచి బోధన్ వరకు ఉన్న రెండు లైన్ల ప్రధాన రహదారిని నాలుగు లైన్ల జాతీ య రహదారిగా విస్తరించనున్నారు. ఈ ప్రాంతంలో నాలుగు లైన్ల జాతీయ రహదారి పనులు పూర్తయితే రవాణా సౌకర్యం మరింత మెరుగు పడనుంది.ఎన్నోఏళ్ల నుంచి ఉమ్మడి జిల్లాల స్థానిక ప్రజలు ఎదురు చూస్తున్న మద్నూర్ బోధన్ జాతీయ రహదారి కల త్వరలోనే నెరవేరనుంది. ఈ లైన్ల నిర్మాణానికి గాను మద్నూర్ నుంచి బోధన్ వరకు గతంలో సర్వే పూర్తి చేశారు. మద్నూర్ నుంచి బోధన్ వరకు ప్రస్తుతం రెండు లైన్ల రహదారి ఉంది. నాలుగు లైన్ల రహదారి విస్తరణకు రూ.634కోట్ల అంచనాతో పనులు ప్రారంభం కానున్న దృష్ట్యా మండలాల స్థానిక గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నిజామాబాద్ కామారెడ్డి జిల్లాల పరిధి లోని జుక్కల్ ,బాన్సువాడ,బోధన్ నియోజకవర్గలను కలుపుతూ కేంద్ర ప్రభుత్వం ఎన్‌హెచ్ 161 బిబి జాతీయ రహదారిని గతంలోని మంజూరు చేసింది. ఈ జాతీయ రహదారి ఉమ్మడి జిల్లాల పరిధిలో మద్నూర్, కోటగిరి, బోధన్ మండలాల పరిధిలోని పలు గ్రామాలను కలుపుతూ నిర్మాణం చేపట్టనున్నారు. ఉమ్మడి జిల్లాల పరిధిలో ఆరు మండలాలైన మద్నూర్, డోంగ్లి, పోతంగల్, కోటగిరి,బీర్కూర్, రుద్రూర్, బోధన్ వరకు ఈ జాతీయ రహదారి నిర్మాణంపనులు జరగనున్నాయి. 2018లో రహదారి పనులకై సర్వే సైతం పూర్తి చేయడమే కాకుండా హద్దు రాళ్లను సైతం ఏర్పాటు చేశారు.



గతంలో సర్వే చేసి హద్దు రాళ్ళు వేసిన దృశ్యం



మద్నూర్ నుంచి బోధన్ వెళ్లే రహదారి

హిందుత్వాన్ని కించపరిచే వారు కాలగర్భంలో కలిసి పోవాల్సిందే

సదాశివనగర్, జూలై 29(ఆంధ్రజ్యోతి): హిందుత్వానికి నష్టం కలిగించినా, హిందుత్వాన్ని కించపరిచిన ప్రతి ఒక్కరు కాలగర్భంలో కలిసిపోతారని బీజేపీ సదాశి వ నగర్ మండల అధ్యక్షుడు కుంట రాంరెడ్డి అన్నారు. హిందు దేవాలయాలపై జరుగుతున్న దాడుల సంద ర్భంగా సదాశివనగర్‌లో విలేకరుల సమావేశాన్ని నిర్వ హించి మాట్లాడారు. హిందువుల ఓట్లతో గద్దెనెక్కిన వ్యక్తి హిందు వ్యతిరేఖ విధానాలను అవలంబించడం సిగ్గుచేదని, ఇది యావత్ తెలంగాణ సమాజం గమని స్తుందని, హిందువుల మనోభావాలు దెబ్బతీసే విధంగా ప్రవర్తించిన ప్రతి వ్యక్తికి సమాజం త్వరలోనే బుద్ధి చెబుతుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి హిందు సమాజం ఓట్లు వేస్తేనే ఆ స్థానంలో నిలిచాడని, హిందువులపై జరుగుతున్న వివక్షను కాంగ్రెస్ పార్టీలో ఉన్న ప్రతివ్యక్తి గమనించాలని తెలిపారు. పార్లమెంటు సాక్షిగా రాహుల్‌గాంధీ హిందు సమాజాన్ని కించపరిచినట్లు మాట్లాడితే ఏ ఒక్కహిందు నాయకుడు నోరు విప్పక పోవడం సిగ్గుచేటన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో హిందువులను ఐక్యం చేస్తూ హిందు సమాజం అభివృద్ధికి కృషి చేసే నాయకులకే పట్టం కట్టాలని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో హిందూ వ్యతిరేక శక్తులు ఓట్ల కోసం వస్తే తప్పకుండా నిలలదీయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ మండల కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు రాంరెడ్డి

కమ్మర్‌పల్లి కేజీబీవీ పాఠశాలలో స్పాట్ అడ్మిషన్‌లు

కమ్మర్‌పల్లి, జూలై 29: (ఆంధ్రజ్యోతి) కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో గల కస్తూర్బా గిరిజన బాలికల పాఠశాలలో స్పాట్ అడ్మిషన్‌ల నిమిత్తం ధరఖాస్తు చేసుకోవాలని కేజీబీవీ పాఠశాల ప్రత్యేకాధికారిణి యూ. గంగమణి ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో 5 సీట్లు, ఏడవ తరగతిలో ఐదు సీట్లు, 8వ తరగతిలో 2 సీట్లు ఖాలీలుగా ఉన్నాయని అసక్తిగల విద్యార్థినిలు ధరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కస్తూర్బా గాంధి బాలికల విద్యాలయం కమ్మర్‌పల్లి బుధ, గురువారాల్లో దరకాస్తులు చేసుకోవాలని ఆమె సూచించారు.

స్కావెంజర్ పోస్టుకు దరఖాస్తులు

ముప్కాల్ ,జూలై 29 (ఆంధ్రజ్యోతి): ముప్కాల్ మండల కేంద్రంలో గల కేజీబీవీ పాఠశాలలో ఖాళీగా ఉన్న స్కావెంజర్ ఉద్యోగానికి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రత్యేకాధికారిణి జీ. వినోద ఒక ప్రకటనలో తెలిపారు. ముప్కాల్ మండలానికి చెందిన మహిళలు ఈ నెల 31 లోపు సాయంత్రం 4 గంటల లోపు ధరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ ఉద్యోగానికి 9750 వేతనం ఉంటుందని 35 సంవత్సరాలు లోపు కలిగి ఉండి 7వ తరగతి పూర్తి చేసిన మహిళలు ధరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కొండ చిలువను చంపిన రైతులు

లింగంపేట, జులై 29 (ఆంధ్ర జ్యోతి) : లింగంపేట మండల కేం ద్రంలోని మత్తడి కింది పల్లెలో మం గళవారం రైతులు కొండ చిలువను చంపారు. స్థానికి అటవి ప్రాంతంలో నుంచి వచ్చి పంట పొలలా వద్ద తిరుగుతున్న కొండ చిలువను గమ నించిన రైతులు భయంతో చంపి నట్లు వారు తెలిపారు.

బిల్లులు రావడం లేదు సారూ..?

» విద్యార్థులకు ఎలా వండి పెట్టాలి?
» ఆవేదన వ్యక్తం చేస్తున్న మధ్యాహ్న భోజనం నిర్వాహకులు

మద్నూర్, జూలై 29 (ఆంధ్ర జ్యోతి) :విద్యార్థుల కోసం మధ్యాహ్న భోజనం వండు తున్న నిర్వాహకులకు సమయానికి బిల్లులు రాకపోవడంతో అప్పులు చేసి వంట చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి మద్నూర్ మండలంలో సుమారు 56 మధ్యాహ్న భోజన ఏజెన్సీలు ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం వండుతున్నారు. వారికి ఐదు నెలల నుంచి గుడ్ల బిల్లులతో పాటు కూరగాయలు, సరుకుల బిల్లులు రావడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తొమ్మి దవ తరగతి నుంచి పదవ తరగతి వరకు మధ్యాహ్న బిల్లులు చెల్లించాల్సి ఉంటుంది. అదేవిధంగా ఒకటవ తరగతి నుంచి ఎనిమిదవ తరగతి వరకు కేంద్ర ప్రభుత్వం మధ్యాహ్న బిల్లులను చెల్లిస్తుంది. ప్రభుత్వ నిబంధన ప్రకారం గుడ్డు రూ. 5.50 పైసలు బిల్లు చెల్లించగా బయట రూ. 7రూపాయలకు కొనుగోలు చే యాల్సి వస్తుందని అందులో నష్టపోతున్నామని మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయమై మండల విద్యాశాఖ వారికి వివరణ కోరగా, ఇటీవల ఐదు నెలల గుడ్ల బిల్లులు 9 నెలల మధ్యాహ్న భోజన బిల్లులకు సంబంధించి జిల్లా అధికారులకు నివేదిక పంపించామని తెలిపారు.



ఉర్దూ పాఠశాలలో వంట చేస్తున్న నిర్వాహకులు

ఆయిల్‌పామ్ పంట పై రైతులకు అవగాహన

మాక్లూర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోర్గాం(కే) గ్రామంలో మంగళవారం ఆయిల్ పాం పంట పై ఏడీఏ విజయలక్ష్మీ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె ఆట్లాడుతూ ఆయిల్ పాం పంట సాగు విధానంపై పలు సూచనలు చేశారు. అనంతరం అమ్రాద్ గ్రామంలో గంగామోహన్ అనే రైతు ఆర్డీఆర్ 1200 రకం వరి పంటను సందర్శించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పద్మ తో పాటు రైతులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ

పట్టణంలో డ్రైడే

ఆర్మూర్ టౌన్ , జూలై 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శాస్త్రీనగర్ లో యూపీహెచ్‌సీ, మున్సిపల్ సిబ్బంది ఆధ్వర్యంలో మంగళవారం డ్రైడే నిర్వహించారు. ప్రతీ ఇంటింటికి వెళ్లి నీటి నిల్వలను పరిశీలించి పూల తొట్టేలో, కొబ్బరి బొండాలలో , టైర్‌లలో నిల్వ ఉన్న నీటిని తొలగించారు. జాతీయ కీటక జనిత వ్యాధులైన దోమల ద్వారా మలేరియా, ఫైలేరియా, డెంగీ, చికెన్‌గున్యా, మెదడు వాపు, బోదకాలు లాంటి వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. సాయంత్రం సమయంలో దోమలు ఇంటిలోకి రాకుండా జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యూపీహెచ్‌సీ సబ్‌యూనిట్ ఆఫీసర్ సాయి, హెల్త్ అసిస్టెంట్ ఆనంద్, జగదీష్, శ్యామల, సౌందర్య, బాగ్య, బాలాజీ, స్వప్న, దినేష్ తదితరులు పాల్గొన్నారు.



నిల్వ ఉన్న నీటిని పరిశీలిస్తున్న దృశ్యం

నీటి కిట్టు .. వాడితే ఒట్టు

» కలుషిత నీటితో రోగాల బారి ప్రజలు
» మిషన్ భగీరథ నీటిలో బ్లీచింగ్ కరువు
» పరీక్షలు చేపట్టాలని ప్రజల వేడుకోలు



కోటగిరి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో తాగునీటి పరీక్షలు అటకెక్కాయి. ఫలితంగా నాణ్యత పరీక్షలు చేయకుండానే కలుషిత నీటిని సరఫరా చేస్తున్నట్లు పలు గ్రామాల వాసులు వాపోతున్నారు. బోధన్ డివిజన్‌లో తాగునీటి కలుషితంతో ప్రజలు రోగాల బారిన పడి ఆసుపత్రుల్లో చేరుతున్నారు. నీటి పరీక్షల నిర్వహణకు కేంద్ర ప్రభుత్వం రెండేళ్ల క్రితం ముందుకు వచ్చింది. జల జీవన్ మిషన్ పథకం కింద పంచాయతీలకు కిట్లు అందజేసింది. వీటిని చాలా గ్రామాల్లో వాడకుండానే పక్కన పెట్టేశారు. రసాయనాలు, ఔషధాల కాలం చెల్లడంతో నిరుపయోగంగా మారాయి.

క్లోరోస్కోప్ కిట్ల పంపిణీ

రాష్ట్రప్రభుత్వం మిషన్ భగీరథ కింద క్లోరోస్కోప్‌కిట్లు సరఫరా చేసింది.వీటి ద్వారా నాణ్యత పరీక్ష విధానంపై మంచినీటి సహాయకులు, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించింది. ప్రతిరోజూ మూడు విభాగాలుగా నీటి నాణ్యత పరీక్షలు నిర్వహించాలని సూచించింది.

మంచినీటి సహాయకులకు శిక్షణ

బోధన్ డివిజన్‌లోని 9మండలాల్లో మంచినీటి సహాయకులను నియమించి వారికి నీటి నాణ్యత పరీక్షల నిర్వహణపై అవగాహన కల్పించారు. గ్రామ పంచాయతీలకు రెండేళ్ల కిందట నాకో మీటర్ వాటర్ క్వాలిటీ, ఫీల్డ్ టెస్ట్ కిట్లు అందజేశారు. అయితే కిట్లు సరఫరా చేసిన అనంతరం వాడకంపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పరిశీలన చేయకపోవడంతో చాలా చోట్ల కిట్లను మూలన పడేశారు.

ప్రశ్నార్థకంగా మంచినీటి కేంద్రాల పరిస్థితి

మంచినీటి కేంద్రాలలో తాగునీటిలో పీహెచ్ క్షర గుణం ఇనుము, తదితర ఆమ్లాలు, క్షరాలు ఎంత పరిమాణంలో ఉన్నాయో గుర్తించేందుకు సాంకేతిక సహాయకులు గ్రామాల్లో పరీక్షలు నిర్వహించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో పారిశుధ్య లోపం, పైపులైన్‌ల లీకేజీలతో నీటి వనరుల చుట్టూ మురుగు పేరుకుపోతోంది. దీంతో తాగునీరు కలుషితం అవుతుంది. అనేక చోట్ల వీధి నల్లాలను గాలికి వదిలేస్తున్నారు. ట్యాంకులు, నల్లాల వద్ద నీటి నమూనాలను సేకరించి తప్పనిసరిగా పరీక్షలు చేయాల్సి ఉంది.

లీకేజీల సమస్య

బోధన్ డివిజన్ పరిధిలోని పలు మండలాల్లో తాగు నీటి నల్లాల వద్ద లీకేజీలు జరిగి నీరు కలుషితం అవుతుంది. అధిక లోతులో మురుగు కాలువ లోపల వేసిన పైపులు లీకేజీకి గురైతే గుర్తించే అవకాశం ఉండదు. ఇలాంటి సందర్భాల్లో ఆ పైపుల నుంచి సరఫరా అయ్యే నీటిని తాగితే వ్యాధులకు ఆహ్వానం పలికినట్లే అవుతోంది. కలుషిత నీటితో జ్వరాలు, వాంతులు, విరేచనాలు వస్తుంటాయి. అధికారులు ఇప్పటికైనా గ్రామాలల్లో తాగు నీటి పరీక్షలు చేపట్టడంతో పాటు నీరు కలుషితం కాకుండా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైన ఉంది.

తాగునీటి పరీక్షలు నిర్వహించేందుకు చర్యలు
: ధన్‌రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కోటగిరి



గ్రామాలల్లో బ్లీచింగ్ పౌడర్‌ను నీటి శుద్ధికి ఉపయోగిస్తాం. నీటి పరీక్షలు నిర్వహించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నాం. గ్రామాలల్లో తాగునీరు కలుషితం కాకుండా తగిన చర్యలు చేపడుతున్నాం.

వేడుక ఏదైనా..
సందర్భం ఎటువంటిదైనా
వివాహ వార్షికోత్సవం
స్వదేశీ, విదేశీయానం
లీగల్ ప్రకటనలు
పదవీ విరమణ
శ్రద్ధాంజలి
జన్మదినం
షష్టిపూర్తి
జయంతి
వర్ధంతి
క్లాసిఫైడ్స్
మీ స్నేహితులు, శ్రేయోభిలాషులు, కుటుంబ సభ్యులకు ఆంధ్రజ్యోతిలో ప్రకటనల ద్వారా అతి తక్కువ రేట్లకే శుభాకాంక్షలు తెలియజేయండి
ఆంధ్రజ్యోతి
ప్రకటనల కొరకు సంప్రదించండి
నిజామాబాద్ : 99854 11453, 95028 11466
99854 00076, 9948406282
ఆర్మూర్ & బోధన్: 99854 11453
కామారెడ్డి & బాన్సువాడ : 99854 11453

రోడ్లు రయ్.. రయ్..!

(5వ పేజీ తరువాయి)

ప్రాధాన్యత క్రమంలో రోడ్ల నిర్మాణం, విస్తీర్ణ పనులు చేపట్టేందుకు అధికారులు ప్రణాళికలను సిద్ధం చేశారు. ముఖ్యంగా మేజర్ గ్రామ పంచాయతీల నుంచి మండల కేంద్రాలు, జిల్లా కేంద్రాలకు లింక్‌రోడ్లను నిర్మించేందుకు ప్రాధాన్యతను ఇస్తున్నారు. కొత్త రోడ్ల నిర్మాణంతో పాటు ఇప్పటికే ఉన్న రోడ్లను విస్తరించడం మరింత అభివృద్ధి చేయడం లాంటి పనులను చేపట్టనున్నారు. ఇలా మూడు విడతల్లో జిల్లాలోని గ్రామీణ రోడ్లన్నింటినీ పూర్తి చేసేందుకు అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు.

ఆగస్టులో టెండర్లు పిలుస్తాం

● మోహన్, ఈఈ, ఆర్‌అండ్‌బీ

హ్యామ్ విధానం ద్వారా జిల్లాలో ఆర్‌అండ్‌బీ శాఖ పరిధిలో 180 కి.మీల దూరం వరకు రోడ్ల పనులు చేపట్టేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇదివరకే ప్రతిపాదనలను ప్రభుత్వానికి నివేదించాం. ఈ రోడ్ల నిర్మాణానికి రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం నిధులు కేటాయించింది. ఆగస్టులో టెండర్లను పిలుస్తాం. టెండర్ల ప్రక్రియ పూర్తికాగానే సెప్టెంబరులో నిర్మాణ పనులు ప్రారంభం అవుతాయి.

ప్రభుత్వ బడుల్లో ప్రీ ప్రైమరి

(5వ పేజీ తరువాయి)

జిల్లాలోని ఆయా పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ప్రీ ప్రైమరి పాఠశాలల్లోకి 4 సంవత్సరాలు నిండిన వారిని తీసుకోనున్నట్లు విద్యాశాఖాధికారులు పేర్కొంటున్నారు. పాఠశాలల్లో చేరిన చిన్నారులను ఆకట్టుకునేలా వివిధ రకాల సామగ్రిని అందజేసి ఆటపాటలతో విద్యాబోధన చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేయనుంది. ఎంపిక చేసిన పాఠశాలలకు బొమ్మలు అందించనుంది. పాఠశాలల భవనాలు, తరగతి గదులను రంగులు, చిత్రపటాలతో అందంగా ఏర్పాటు చేయనున్నారు. అలాగే ఇన్‌స్ట్రకర్లను నియమించేందుకు ఉత్తర్వులు జారీ చేసింది. ఒక్కొక్క విద్యార్థికి ప్రభుత్వం రూ.500 అందజేయనుంది. ఇందులో రూ.100 నోట్ పుస్తకాలకు, రూ.250 స్టేషనరి, రూ.150 చార్టు పేపర్ల కోసం వినియోగించనున్నారు. దీనికి సంబంధించిన నిధులను సైతం ప్రభుత్వం విడుదల చేసింది.

తరగతుల నిర్వహణకు సిద్ధం చేస్తున్నాం

● రాజు, డీఈవో, కామారెడ్డి

రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ప్రీప్రైమరీ పాఠశాలలను ఏర్పాటు చేసేందుకు ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలోని 71 పాఠశాలలను ఎంపిక చేశాం. ఇందులో ఎక్కువగా గ్రామీణ ప్రాంతంలోని వాటికి ప్రాధాన్యతను ఇచ్చాం. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా అన్ని సౌకర్యాలతో ఏర్పాట్లు చేసేందుకు సిద్ధం అవుతున్నాం. అడ్మిషన్‌ల ప్రక్రియ కొనసాగుతుంది. 4 సంవత్సరాలు నిండిన పిల్లలను ప్రీప్రైమరి పాఠశాలలో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించాం.

బీసీ బిల్లు ఆమోదం కోసం..

(5వ పేజీ తరువాయి)

కలుస్తామన్నారు. బీజేపీ నేతలు కోడిగుడ్డుపై ఈకలు పీకడం మానుకోవాలన్నారు. బీసీ బిల్లుపై అభ్యంతరాలు ఉంటే చర్చిద్దాం... కాని కొట్లాటలు సృష్టించవద్దని కోరారు. గ్రామపంచాయతీలకు రెండేండ్లుగా ఎన్నికలు లేక రూ.6వేల కోట్లు నష్టపోయామన్నారు. బీసీ రిజర్వేషన్లను బీజేపీ అడ్డుకునే కుట్ర చేస్తుందని విమర్శించారు. బీసీ బిల్లుపై అభ్యంతరాలు ఉంటే పార్లమెంట్‌లో చర్చకు పెట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని ప్రతి మహిళను ఆర్థికంగా సామాజికంగా బలోపేతం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. 2004 నుంచి 2014 వరకు గతంలో కాంగ్రెస్ ప్రభుత్వమే పేద వారికి రేషన్‌కార్డులు అందించిందన్నారు. తిరిగి మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వమే కార్డులను పంపిణీచేస్తుందన్నారు. పేద ప్రజల కడుపు నింపడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషిచేస్తుందన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డులు, వడ్డీలేని రుణాలు అన్ని కేవలం మహిళల పేరిట మాత్రమే ఇస్తామన్నారు. మహిళలు సంతోషంగా ఉంటేనే సమాజం, కుటుంబం బాగుంటుందని భావించి ప్రభుత్వం ఏర్పడ్డ మొదట్లో చిల్లిగవ్వ లేకున్న చదువుకోడానికి, చిరుఉద్యోగాలకు వెళ్లే ఆడకూతుళ్లకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించామన్నారు. ప్రస్తుతం మహిళ సంఘాలకు వడ్డీ భారం పడకుండా రూ.26 వేల కోట్లను ఇస్తున్నామన్నారు. కోటి రూపాయలు స్త్రీనిధి అందిస్తున్నామని, మహిళలు ఈ డబ్బులను వృథాచేసుకోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ, కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్, అదనపు కలెక్టర్ విక్టర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడలో వర్షం

బాన్సువాడ టౌన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : బాన్సువాడ పట్టణంలో మంగళవారం మధ్యాహ్నం నుంచి ఓ మోస్తారుగా వర్షం కురుస్తోంది. వర్షాలు కురియడంతో చెరువులు, కుంటలు, ప్రాజెక్టుల్లో నెమ్మదిగా నీరు చేరుతోందని అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఉప్పల్వాయి గురుకుల విద్యార్థులకు ఆహ్వానం

రామారెడ్డి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రామారెడ్డి మండలం ఉప్పల్వాయి గురుకుల పాఠశాల / హాస్టల్ ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు ఖాళీగా ఉన్న సీట్లకు భర్తీ కోసం ఈ నెల 31న అడ్మిషన్లను తీసుకోవడం జరుగుతుందని కళాశాల ప్రిన్సిపల్ శివరాం తెలిపారు. మధ్య మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులు ఈనెల 31వ తేదీన ఉదయం తొమ్మిది గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంటల వరకు దరఖాస్తు పత్రాలు తీసుకొని వచ్చి ఇంటర్వ్యూలకు హాజరు కావాలని ప్రిన్సిపాల్ శివరాం వివరించారు.

మద్నూర్: మండలంలోని పెద్ద ఎక్లారా సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ స్వప్న తెలిపారు. గురుకుల బాలికల కళాశాలలో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయడానికి ఈనెల 31 నాడు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. విద్యార్థులు విద్యార్హతకు సంబంధించిన ధ్రువపత్రాలను తీసుకురావాలని మెరిట్ జాబితా ఆధారంగా ఎంపిక చేయడం జరుగుతుందని సూచించారు.

దోమకొండ గురుకుల పాఠశాలలో స్పాట్ అడ్మిషన్లు

దోమకొండ, జూలై 29(ఆంధ్రజ్యోతి): దోమకొండ మండలకేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో ఇంటర్మీడియేట్‌లో మిగిలిపోయిన సీట్లకు ఈ నెల 30న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించడం జరుగుతుందని ప్రిన్సిపాల్ చైతన్య సుధ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, 10వ తరగతి పరిక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా ఈ సీట్లను భర్తీ చేయడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

భిక్కనూరులో స్పాట్ అడ్మిషన్‌లు

భిక్కనూరు, జూలై 29(ఆంధ్రజ్యోతి): భిక్కనూరు మండలంలోని సిద్ధరామేశ్వరనగర్ గ్రామ సమీపంలో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలోని ఇంటర్ మొదటి సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తికి స్పాట్ అడ్మిషన్ నిర్వహించడం జరుగుతుందని ప్రిన్సిపాల్ పి.వెంకటేశం మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం బైపీసీ, ఎంపీసీలో ఖాళీలు ఉన్నాయని వాటి భర్తికి ఈ నెల 31న ఉదయం 9గంటలకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఒరిజినల్ సర్టిషికేట్లతో పాటుగా ఆధార్‌కార్డు, బ్యాంకు బుక్కు, ఫోటోలతో సమయానికి హాజరుకావాలని కోరారు.

సీసీ రోడ్డు పనులను పరిశీలించిన డీఈ

లింగంపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : లింగంపేట మండల కేంద్రంలోని పెద్దమ్మ ఆలయం నుంచి పోస్టాఫీసువరకు వేస్తున్న సీసీ రోడ్డు పనులను మంగళవారం డీఈ వెంకటేశ్వర్లు పరిశీలించారు. రూ. కోటితో సీసీ రోడ్డు వేస్తున్నట్లు ఆయన తెలిపారు. రోడ్డు పనులు నాణ్యతగా వేయాలని ఆయన కాంట్రాక్టర్‌కు సూచించారు.

రూసేగావ్‌లో మూతబడిన ప్రభుత్వ పాఠశాల



రుసేగాం తెరుచుకోని పాఠశాల

మద్నూర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఒకవైపు విద్యార్థులు చదువుకునే విధంగా ప్రోత్సహించటానికి ఉచిత చదువు, మధ్యాహ్నభోజనం, పాఠశాల యూనిఫామ్‌లు అందజేస్తూ ప్రతి ఒక్కరూ చదువుకునే విధంగా కృషి చేస్తుంది. కానీ కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలంలోని రుసేగావ్ గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ఈ విద్యా సంవత్సరం నుంచి మూతపడింది. గత ఏడాది సైతం ఈ పాఠశాలలో ఉపాధ్యాయులు లేక తెరుచుకోకపోవడంతో ఆంధ్రజ్యోతి కథనం ప్రచురించగా సంందించిన జిల్లా విద్యాశాఖ అధికారులు వెంటనే ఇద్దరు ఉపాధ్యాయులను నియమించారు. ఈ ఏడాది మాత్రం గ్రామములో ప్రభుత్వ పాఠశాలకు తమ పిల్లలను గ్రామస్తులు పంపటం లేదన్న సాకుతో ప్రభుత్వ పాఠశాలను మూసివేసినట్లు తెలుస్తుంది. గత ఏడాది ఈ పాఠశాల 1 నుంచి 5వ తరగతి వరకు సుమారు 20 నుంచి 25 మంది విద్యార్థులు ఉండేవారు అటువంటిది ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలకు బదులు గ్రామస్తులు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపిస్తుండడంతో పాఠశాల మూసివేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ గ్రామం నుంచి చదువుకోవడానికి విద్యార్థులు ప్రైవేటు పాఠశాలకు వెళ్లాలంటే సుమారు 12 కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి ఉంటుంది. అటువంటిది గ్రామస్తులు ప్రభుత్వ పాఠశాలకు ఎందుకు పంపటం లేదని పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అధికారులు గ్రామానికి వెళ్లి గ్రామస్తులతో మాట్లాడి వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపే విధంగా అవగాహన కల్పించినట్లయితే మళ్లీ గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ప్రారంభమవుతుందని మరి కొందరు అభిప్రాయ పడుతున్నారు. ఈ విషయమై అటు అధికారులు ఇటు నాయకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలకు వచ్చే విధంగా కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఆరోగ్యశ్రీ కార్డుల అందజేత

కామారెడ్డిటౌన్, జూలై 29(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లాలోని 105 మంది ఆర్ఫాన్ పిల్లలకు ఆరోగ్యశ్రీకార్డులను మంత్రి సీతక్క, ప్రభుత్వ సలహదారుడు షబ్బీర్‌అలీచేతుల మీదుగా పంపిణీచేయడం జరిగిందని జిల్లా ఆరోగ్యశ్రీ ఇంచార్జ్ అల్లావుద్దిన్ తెలిపారు. అనాథ పిల్లలకు రూ.10లక్షల వరకు ఆరోగ్యశ్రీకార్డు ద్వారా లబ్దిపొందవచ్చునని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ ప్రమీల, సీడీపీఓ శ్రీలత, బాలసదన్ సూపర్‌వైజర్ సంగమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

23పికెడి 29: వివరాలు తెలుసుకుంటున్న ఎంపీడీఓ, వైద్యసిబ్బంది

రాజంపేటలో వైద్యశిబిరం

రాజంపేట, జూలై 29(ఆంధ్రజ్యోతి): రాజంపేట మండలంలోని ఎల్లాపూర్‌తండాలో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. గతపది రోజులుగా గ్రామంలో శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎర్రపహాడ్ మెడికల్ ఆఫీసర్ ఖాసీం, ఎంపీడీఓ బాలకృష్ణలు తెలిపారు. ఇంటింటికి తిరిగి జ్వరాలతో బాధపడుతున్న వారి నుండి రక్తనమునాలు సేకరించి పరీక్షలకు పంపామని తెలిపారు. గ్రామంలో డెంగ్యూకేసులు నమోదు అవుతున్నాయని తెలిపారు. దాదాపు 10 మంది కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. అలాగే గ్రామంలో విషజ్వరాలు వస్తున్నందున పరిసరాల పరిశుభ్రతపై చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ కార్యదర్శికి సూచించారు. ప్రజలకు సైతం తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో హెచ్‌ఈవో నారాయణ,గుండారం వైద్యులు వినయ్‌కుమార్, ఏపీఓ శృతి, టీఏ రాజు, సూపర్‌వైజర్ సరస్వతి, ఏఎన్ఎంలు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

పొలంలో నాట్లు వేసిన చిన్నారులు

కామారెడ్డిటౌన్, జూలై 29(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చదువుతో పాటు ఏండ్లుగా తాతముత్తాతలు చేస్తున్న వ్యవసాయాన్ని పరిచయం చేసేందుకు విద్యార్థులను ఆయా పాఠశాలలు క్షేత్రపర్యటనలు చేయిస్తున్నాయి. అందులో భాగంగానే మంగళవారం కామారెడ్డి పట్టణంలోని విశ్వభారతి పాఠశాలకు చెందిన విద్యార్థులు రామేశ్వర్‌పల్లిలో వ్యవసాయ పనులను పరిశీలించి నాట్లు వేశారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ సలాం మాట్లాడుతూ విద్యార్థులకు పుస్తకాలలోని పాఠశాలతో పాటు క్షేత్రస్థాయిలో మనం తింటున్న ఆహారాన్ని ఎలా పండిస్తారనే దానిపై వివరించామని తెలిపారు.

రాజంపేటలో ఫేస్ రికగ్నైజేషన్ ప్రాజెక్ట్ ప్రారంభం

రాజంపేట, జూలై 29(ఆంధ్రజ్యోతి): రాజంపేట మండల కేంద్రంలోని పోస్టాఫిస్‌లో మంగళవారం ఫేస్ రికగ్నైజేషన్‌ను ప్రారంభించినట్లు డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ మేనేజర్ శోభారాణి తెలిపారు. అడ్వాన్స్ పోస్టల్ టెక్నాలజీ ద్వారా వేలిముద్ర స్థానంలో పేస్ రికగ్నైజేషన్ గుర్తింపు ద్వారా చేయూత పెన్షన్‌లు అందించడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్పీఎం మురళిగౌడ్, ఏంఓ వెంకట్రాంరెడ్డి,సిబ్బంది రాము,రవి తదితరులు పాల్గొన్నారు.

వరి నాట్లు వేయడంలో
మహిళా రైతులు బిజీబిజీ

రామారెడ్డి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రానికి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న రామారెడ్డి మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో, తండాల్లో వ్యవసాయ భూముల్లో మహిళలు వరి నాట్లు వేయడంలో రైతులు బిజీబిజీగా ఉంటున్నారు. రామారెడ్డి సమీపంలో ఉన్న సదాశివనగర్, మాచారెడ్డి మండలాల నుండి రైతులు ప్రత్యేక వాహనాలపై వస్తూ ఎకరానికి గుత్తా చొప్పున మహిళలు వరి నాట్లు వేస్తున్నారు. రామారెడ్డి మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో, తండాల్లో తొమ్మిది వేల ఎకరాల్లో వరి నాట్లు వేసినట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి భానుశ్రీ పేర్కొన్నారు. సోయాబీన్ మూడు వందల నలుపై ఎకరాల్లో, మొక్కజొన్న రెండు వందల యాభై ఎకరాల్లో, నాలుపై ఏడు ఎకరాల్లో కాటన్ పంటలను రైతులు సాగుచేస్తున్నారు. రైతులు హార్టికల్చర్ దుకాణాల్లో వ్యవసాయ రంగానికి సంబంధించిన విత్తనాలు, ఎరువులను పంపిణీ విధంగా అమ్ముతున్నారు. గుత్తా చొప్పన మహిళలు వరి నాట్లు చేస్తున్నారు.

నేడు పీఎంపీ, ఆర్ఎంపీ
వైద్యుల జిల్లా కమిటీ ఎన్నికలు

లింగంపేట, జులై 29 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 30న కామారెడ్డిలోని శ్రీనివాస కళ్యాణ మండపంలో పీఎంపీ, ఆర్ఎపీ వైద్యుల జిల్లా కార్యవర్గ ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు పీఎంపీ, ఆర్ఎంపీల జిల్లా నాయకుడు నిజ్జన విఠల్ తెలిపారు. ఈ ఎన్నికలకు జిల్లాలోని ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులు హాజరు కావాలని ఆయన కోరారు. ఎన్నికలకు రాష్ట్ర అధ్యక్షుని సమక్షంలో జరుగుతాయని ఆయన తెలిపారు.

ఉమ్మడి జిల్లాకు ఇంజనీరింగ్ కళాశాలను
ఏర్పాటు చేయాలని మంత్రికి వినతి

భిక్కనూరు, జూలై 29(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు ఇంజీరింగ్ కళాశాల మంజూరు చేయాలని కోరుతూ దోమకొండ పర్యటనకు వెళ్తున్న ఇంచార్జి మంత్రి సీతక్కకు, ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీకి మండలంలోని బీటీఎస్ వద్ద డాక్టరేట్స్ అసోసియేషన్స్ ప్రతినిధులు మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ యూనివర్సిటీలో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలను ఏర్పాటు అయ్యేవిధంగా కృషిచేస్తానని గతంలో పీసీసీ అధ్యక్షుడి హోదాలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారని తెలిపారు. ఇదే విషయమై ఉన్నతా విద్యామండలి కమిటీ, ప్రభుత్వానికి నివేదికలు అందజేసినప్పటికి ఆలస్యం జరుగుతుందన్నారు. సోమవారం జరిగిన క్యాబినెట్ సమావేశంలో జిల్లాకు ఇంజనీరింగ్ కళాశాల మంజూరు చేస్తారని జిల్లా ప్రజలు. విద్యార్థులు ఆశగా చూశారని అన్నారు. జిల్లాకు వెంటనే ఇంజనీరింగ్ కళాశాల మంజూరయ్యే విధంగా మంత్రి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ యూనివర్సిటీ డాక్టరేట్స్ అసోసియేషన్ ప్రతినిధులు డాక్టర్ సంతోష్‌గౌడ్, డాక్టర్ రాహుల్, డాక్టర్ సరిత, డాక్టర్ రమాదేవి, డాక్టర్ దిలీప్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

'గ్రామాలకు వెళితే సమాచారం ఇవ్వండి'

మద్నూర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో దొంగలోస్తున్నారని ఇంటికి తాళం వేసి వేరే గ్రామానికి వెళ్లినట్లయితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని పోలీసులు ప్రజలకు అప్రమత్తం చేస్తున్నారు. ఇటీవల మండల కేంద్రంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో ఇంటికి తాళం వేసి ఉన్న మూడు ఇళ్లల్లో తాళాలు పగులగొట్టి దొంగతనానికి పాల్పడ్డారు. ప్రభుత్వ ఉద్యోగి ఇంట్లో దొంగతనానికి పాల్పడి రూ.40 వేల రూపాయలు అపరించుకుపోయారు. దొంగతనానికి వచ్చిన వారీ దృశ్యాలు సీసీ కెమెరాలలో రికార్డు కావడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. మీరు భయపడాల్సినది లేదని మేమున్నామంటూ పోలీసులు హౌసింగ్ బోర్డు కాలనీలో ఇంటింటికి తిరిగి భరోసా కల్పిస్తున్నారు. హౌసింగ్ బోర్డు కాలనీలోని సీసీ కెమెరాలు ఉన్న ఇండ్లలో గత నాలుగు రోజుల నుంచి రికార్డు అయిన దృశ్యాలను పరిశీలిస్తున్నారు. రాత్రిపూట గస్తీ పెంచాలని ప్రజలు కోరుతున్నారు.

అడ్లూర్ ఎల్లారెడ్డిలో హైమాస్ లైట్లు ఏర్పాటు

సదాశివనగర్, జూలై 29(ఆంధ్రజ్యోతి): సదాశివనగర్ మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామంలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు కృషితో ప్రధాన చౌరస్తా వద్ద హైమాస్ లైట్లు ఏర్పాటు చేయడం జరిగిందని మంగళవారం సింగిల్ విండో చైర్మన్ మర్రి సదాశివరెడ్డి తెలిపారు. ప్రధాన చౌరస్తాల వద్ద వెంటిలేషన్ లైటింగ్ ఇబ్బంది ఉండటం వలన ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి స్థానిక కాంగ్రెస్ నాయకులు తీసుకెళ్లడం జరిగిందన్నారు. దీనికి వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ఎంపీ నిధుల నుండి రెండు హైమాస్ లైట్లను మంజూరు చేయించడం జరిగిందన్నారు. ఈ సహకారం అందించిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు, నాయకులు కృతజ్ఞతలు తెలిపారు

మండల బంజారా సేవా సంఘం
అధ్యక్షులుగా శివాజీ



శివాజీ రాథోడ్

మద్నూర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : మద్నూర్ మండలం ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా బంజారా సేవా సంఘం అధ్యక్షులు సురేందర్ తెలిపారు. ఇటీవల కామారెడ్డి జిల్లా కేంద్రంలో జరిగిన ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం సమావేశంలో మద్నూర్ మండల బంజారా సేవా సంఘం అధ్యక్షులుగఆ శివాజీ రాథోడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. ప్రధాన కార్యదర్శిగా బాలాజీ నాయక్, ఉపాధ్యక్షులుగా సంతోష్, మాధవ్, సహాయ కార్యదర్శులుగా శేషారావు, వసంత్. కోశాధికారిగా శ్రీనివాస్, గౌరవ అధ్యక్షులుగా కుశాల్‌లను ఎన్ను కున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగఆ ఎన్నికైన శివాజీ రాథోడ్ మాట్లాడుతూ ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం మండల అధ్యక్షులుగా ఎన్నుకున్నందుకు ధన్యవాదాలు తెలుపుతూ బంజారాల అభివృద్ధి కోసం వారి సమస్యల పరిష్కారం కోసం అందుబాటు ఉంటానని హామీ ఇచ్చారు.



టీటీడీలో గరుడ వాహనంపై స్వామిని ఊరేగిస్తున్న దృశ్యం

గరుడ వాహనంపై విహరించిన శ్రీవారు

బీర్కూర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండలం తిమ్మాపూర్ గ్రామ సమీపంలోని తెలంగాణ తిరుమల దేవస్థానం మాడ వీధుల్లో శ్రీవారు గరుడ వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. మంగళవారం గరుడ పంచమి సందర్భంగా శ్రీవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం గరుడ వాహనం పై స్వామి వారిని మాఢ విధుల్లో ఊరేంగించారు. గరుడ వాహనంపై స్వామివారు విహరిస్తుండగా భక్తులు వీక్షించి తరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.



సంగం తండాలో భూ భారతి సర్వేను నిర్వహిస్తున్న అధికారులు

భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి సర్వే

నసురుల్లాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి సర్వే ద్వారానే భూ సమస్యలు పరిష్కారమవుతాయని రెవెన్యూ ఇన్స్పెక్టర్ వెంకటస్వామి అన్నారు.. మంగళవారం మండలంలోని సంఘం తాండ గ్రామంలో రెవెన్యూ అధికారులతో కలిసి భూ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులో రైతుల ద్వారా భూ సమస్యల కోసం వచ్చిన దరఖాస్తులను దృష్టిలో ఉంచుకొని భూభారతి సర్వే నిర్వహించడం జరిగిందన్నారు. ఆయన వెంట సర్వేయర్ మధు, రెవెన్యూ అధికారులు, మాజీ ఎంపీపీ విటల్, రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఇసన్నపల్లిలో ప్రతిఒక్కరికి బీపీ, షుగర్ పరిక్షలు



మండలంలోని ఇసన్నపల్లిలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

భిక్కనూరు, జూలై 29(ఆంధ్రజ్యోతి): భిక్కనూరు మండలంలోని ఇసన్నపల్లి గ్రామంలో నాన్ కమ్యూనికేబుల్ డిసిజెస్ జిల్లా ప్రోగ్రాం అధికారిణి డాక్టర్ శిరీష్ ఆదేశాల మేరకు మండల వైద్యాధికారి ఆధ్వర్యంలో మంగళవారం ఇంటింటికి బీపీ, షుగర్ పరిక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణీ మాట్లాడుతూ గ్రామంలో ఇంటింటికి తిరిగి 30 సంవత్సరాలు దాటిన ప్రతిఒక్కరికి రక్తపోటు, మధుమేహం పరిక్షలు నిర్వమించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది ప్రశాంత్, యశోధ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయ అభివృద్ధికి దాతల విరాళం

భిక్కనూరు, జూలై 29(ఆంధ్రజ్యోతి): భిక్కనూరు మండలంలోని తిప్పాపూర్ గ్రామ అయ్యప్ప ఆలయ అభివృద్ధికి దాతలు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారని ఆలయ కమిటీ ప్రతినిధులు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి గ్రామానికి చెందిన విండో చైర్మన్ ఏనుగు వెంకట్‌రెడ్డి-విజయ దంపతులు రూ.11,116లు, ఏనుగు శోభ బాపురెడ్డి దంపతులు రూ.25,555లు, నాగర్తి జయశ్రీ కూతరు కీర్తిరెడ్డి రూ.15వేలు, మాజీ విండో చైర్మన్ వంగేటి సువర్ణ-నర్సారెడ్డి దంపతులురూ. 11,111లు, అందజేయడం జరిగిందన్నారు. గ్రామంలో గ్రామస్థులు, దాతల సహకారంతో హరిహర పుత్ర అయ్యప్ప ఆలయాన్ని నిర్మించడం జరుగుతుందన్నారు. అనంతరం దాతలను కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో
మెజార్టీ సీట్లు సాధించేలా ముందుకు సాగాలి

భిక్కనూరు, జూలై 29(ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కామారెడ్డి జిల్లాలో మెజార్టీ సీట్లు సాధించేలా కలిసికట్టుగా ముందుకు సాగాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి మీనాక్షీ నటరాజన్, పీసీసీ చైర్మన్ మహేష్‌కుమార్‌గౌడ్ తెలిపినట్లు పీసీసీ ప్రధాన కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్‌రెడ్డి తెలిపారు. హైదారాబాద్‌లో మీనాక్షి నటరాజన్‌ను మంగళవారం ఆయన మార్యదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా రాజకీయాలపై వారితో చర్చించడం జరిగిందని, ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ప్రతిపక్ష నాయకుల అసత్యపు ప్రచారాలను తిప్పికొట్టాలని సూచించినట్లు తెలిపారు.

తాడ్కోల్ పాఠశాలలో కంప్యూటర్లు ఏమైనట్లు..?

బాన్సువాడ రూరల్, జూలై 29(ఆంధ్రజ్యోతి): బాన్సువాడ మండలంలోని తాడ్కోల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానాన్ని అందించాల్సి ఉన్న కంప్యూటర్లు మాయమవడం పలు అనుమానాలకు దారి తీస్తుంది. పాఠశాలలో ఎలాంటి దొంగతనానికి సంబంధించిన ఆనవాళ్లు లేకపోవడం, ఇది కేవలం పాఠశాలకు సంబంధించిన వారే కంప్యూటర్లను ఎత్తుకెళ్లినట్లు పలువురు అనుమానిస్తున్నారు.

కంపుకొడుతున్న మహమ్మద్‌నగర్ మండల కేంద్రం

● పైప్‌లైన్ లీకేజీలు, అధ్వానంగా మురుగు కాలువలు

మహమ్మద్‌నగర్, జూలై 29(ఆంధ్రజ్యోతి): మహమ్మద్‌నగర్ మండలకేంద్రం చెత్తచెదారంతో, మురికి కాలువల దుర్వాసతో, పైప్‌లీకేజీలతో అధ్వానంగా తయారైంది. మండలకేంద్రంలో నీటి పైప్‌లైన్‌లు లీకేజై మురుగునీరు వాటర్‌ట్యాంకులోకి వెళ్తుంది. మురికికాలువలు శుభ్రంగా లేకపోవడంతో దోమలు విజృంభించడంతో పాటుగా మురికికాలువల చుట్టూ పిచ్చిమొక్కలు మొలకెత్తి వనంలాగా తయాయ్యాయి. మురికికాలువల దుర్వాసతో ప్రజలు అనారోగ్యం పాలవడంతో పాటుగా తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కోంటున్నారు. వర్షాకాలం కావడంతో మురికికాలువలు శుభ్రంగా లేక నీరు ఎక్కడిక్కడే నిలిచిపోయి దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. దీనికితోడు గ్రామపంచాయతీ వాటర్ ట్యాంకుకు నీరందించే పైప్‌లైన్ లీకేజీ కావడంతో మురుగునీరు వాటర్‌ట్యాంకులోకి వెళ్లి నీరు కలుషితమవుతుంది. గత వారం రోజుల నుండి ఈ సమస్య ఉన్నప్పటికీ గ్రామపంచాయతీ సిబ్బంది కానీ, కార్యదర్శి కానీ అటువైపు కన్నెత్తి చూడని పరిస్థితి నెలకొంది. కలుషితమైన నీరునే త్రాగేందుకు నల్లల ద్వారా గ్రామపంచాయతీ సిబ్బంది అందించడంతో విషజ్వరాలు ప్రబలుతున్నాయి. వర్షాకాలం కావడంతో విషజ్వరాల డెంగ్యూ, మలేరియా వ్యాధులు వ్యాపించే అవకాశం ఉన్న గ్రామపంచాయతీ అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురికికాలువలను శుభ్రం చేసి చెట్టు ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించి, లీకేజవుతున్న పైప్ లైన్‌కు మరమత్తులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.



సినిమా గైడ్ కామారెడ్డి

కామారెడ్డి

దర్శన్ - మై బేబీ
ప్రియా 70 - జూనియర్
ప్రియా 35 - కొత్తపల్లిలో ఒక్కప్పుడు

బాన్సువాడ

మహేశ్వరి - హరిహర వీరమల్లు
వెంకటేశ్వర - కొత్తపల్లిలో ఒకప్పుడు



చికెన్ ధరలు

రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	120	140	170
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

